ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7 వరంగల్
ఆదివారం 30 మార్చి 2025

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:35 (ఆదివారం సాయంత్రం)

సర్వర్ డౌన్..

- మీ సేవా కేంద్రాల్లో సర్వర్ సమస్య
- ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం
- తిరుగుతున్న యువవికాస దరఖాస్తుదారులు
- ఏప్రిల్ 5కు గడువు పూర్తి

9



విశ్వావసు ఉష్షస్సులో..

శ్రీ విశ్వావసు తెలుగు కొత్త సంవత్సరం ప్రారంభం

- ఆలయాల్లో జోరుగా సాగనున్న పంచాంగ శ్రవణాలు
- షడ్రుచుల సమ్మేళనమైన పచ్చడికి ప్రాధాన్యత
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భక్తుల దర్శనాలు
- శ్రీరామ నవరాత్రి వేడుకలూ ఆరంభం
- పూజా సామగ్రి కొనుగోళ్లతో సందడిగా కూడళ్లు

9



పూజ సామాను కొనుగోలు చేస్తున్న ప్రజలు

నేడు ఉగాది పర్వదినం

వసుధపై వసంతం వికసించిన తొలి రోజును స్మరించుకుంటూ.. తెలుగు నాట చేసుకునే తొలి పర్వం ఉగాది. ప్రకృతితో మమేకమైన మన సంస్కృతికి మచ్చుతునక ఈ పర్వం. చైత్రశుద్ధ పాడ్యమి ఆదివారం శ్రీ విశ్వావసు నూతన తెలుగు ఉగాది పర్వదినాన్ని జరుపుకునేందుకు వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రజలంతా సమాయత్తమయ్యారు. తెల్లవారుజామున్నే లేచి అభ్యంగన స్నానాలు ఆచరించి, మామిడితోరణాలు, పూలతో ఇంటిని అలంకరించుకుని, ఇంట్లో పూజా మందిరంలో ఇష్టదైవాన్ని పూజలు చేసి పూజించుకొని షడ్రుచుల ఉగాది పచ్చడి సేవించడం ఈ పండుగ పరమార్థం. పంచాంగ శ్రవణం శుభ గుణాలను ఇస్తుందని, శత్రువులను నశింపజేస్తుందని దుస్వప్న ఫలితాలను పోగొడుతుందని, ఆయుస్సును పెంచడమేకాక గంగా స్నాన, గోదాన ఫలితాలను ఇస్తుందన్న విశ్వాసంతో ప్రతీ ఒక్కరు పంచాంగ శ్రవణాన్ని వినేందుకు ఆసక్తి చూపుతారు. ప్రధానంగా శుభ, అశుభ ఫలితాలు, గ్రహచార ఫలం, ఫలశృతి, సంవత్సరాంత ఫలితం, ఏ గ్రహానికి అధికారం లాంటి విషయాలు తెలుసుకొని మనిషి భవిష్యత్ మార్గదర్శనం చేసుకునేందుకు ఈ పర్వదినం గీటురాయిగా తీసుకుంటారు.

-హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్

డివిజన్ హోదా దక్కకుండా కుట్రలు

- కాజీపేటకు రైల్వే డివిజన్ సాధించి తీరుతాం..
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాజీపేట జంక్షన్‌కు డివిజన్ హోదా రాకుండా కొందరు అధికారులు కుట్రల పన్నుతున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆరోపించారు. ఆ కుట్రలో భాగమే ఇక్కడికి రావాల్సిన లోకోరన్నింగ్ స్టాఫ్ పోస్టులను ఇతర డివిజన్‌లకు తరలిస్తున్నారని, వారి కుట్రలు తిప్పి కొట్టి డివిజన్ సాధించి తీరుతామని అన్నారు. కాజీపేట రైల్వే సంఘ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడారు. కాజీపేటకు మంజూరు కావాల్సిన క్రూకంట్రోల్ నుంచి 185 మంది లోకోపైలెట్‌లు, అసిస్టెంట్ లోకో పైలెట్‌లు, ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఇతర డివిజన్‌లకు తరలించారని రైల్వే ఆర్డర్ విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తరలించిన పోస్టులను వెంటనే కాజీపేటకు తీసుకురావాలని హెచ్చరించారు. డివిజన్ రాకుండా ఓ రైల్వే అధికారి చేసే కుట్రలే ఇవి అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

25 ఏళ్లగా కాజీపేట అభివృద్ధికి ఉద్యమాలు చేస్తున్నామని నాయిని పేర్కొన్నారు. కోచ్‌ఫ్యాక్టరీ, డివిజన్ సాధన, పిట్‌లైన్‌లకోసం నిత్యం రైల్వే జీఎం, డీఆర్‌ఎంల దృష్టికి తీసుకెళ్లామన్నారు. డివిజన్ సాధన కోసం ఎంపీ కడియం కావ్య నేతృత్వంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలుస్తామన్నారు. ఇందుకు జిల్లా బీజేపీ నాయకులు కలిసిరావాలని, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి ద్వారా డివిజన్ సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. లేకుంటే అన్నిరాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, ట్రేడ్ యూనియన్ నాయకులతో కలిసి జేఏసీగా ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈమీడియా సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డీ. అంకూస్, నాయకులు బంక సంపత్, షేక్ అజ్గర్, ఇప్ప శ్రీకాంత్, తమ్మడి మానస, బబ్లూ, దువ్వ రాజు, రేవతి, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద

దివ్యాంగుల వినతులు వెంటనే పరిష్కరించాలి

వరంగల్ కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల నుంచి అందిన వినతులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సత్యశారద కోరారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన దివ్యాంగుల ప్రజావాణిలో వినతులు స్వీకరించి మాట్లాడారు. దివ్యాంగుల కోసం నిర్వహించే ప్రత్యేక ప్రజావాణిలో అందిన వినతులు శాఖల వారిగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. దివ్యాంగులు, వయోవృద్ధుల నుంచి మొత్తం 9 వినతులు రాగా, ఇందులో డీఆర్‌డీవో సంబంధించి 4, జిల్లా సంక్షేమ శాఖ 2, జడ్పీ సీఈవో 3 వచ్చాయి. ప్రత్యేక ప్రజావాణిలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మీ, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేయూ బడ్జెట్ రూ.428.82 కోట్లు

- ప్రభుత్వ గ్రాంట్లు రూ.195.62కోట్లు
- ఇతర వనరుల నుంచి రూ.170.55కోట్లు
- ఉద్యోగుల జీతభత్యాలకు రూ.369.21కోట్లు
- వర్సిటీ లోటు బడ్జెట్ రూ.2.45 కోట్లు
- వర్సిటీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్

9


మచిలీబజార్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నియోజవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ 10వ డివిజన్ మచిలీబజార్, నభీఖానా వద్ద రూ.75లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, సైడ్‌డ్రైన్ పనుల శిలాఫలకాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో 10వ డివిజన్ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన కొన్ని మాసాల్లోనే ప్రత్యేక నిధులు కేటాయించి డివిజన్‌ను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. అదే విధంగా దశల వారిగా డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో సైడ్ డ్రైన్‌లు, సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. కాలనీల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కత్తెర సారంగపాణి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, వేయిస్తంభాల ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, మాజీ కార్పొరేటర్ నజీమ్ జిహాన్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు మల్లన్న ఆలయ ఆదాయం రూ.1.22 కోట్లు

- హుండీల ద్వారా 25 రోజులకు రూ. 25.96 లక్షలు
- టికెట్ల ద్వారా సమకూరిన సొమ్ము రూ. 96.29 లక్షలు


హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది, పర్యవేక్షిస్తున్న ఈవో, పరిశీలకులు

ఐనవోలు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం హుండీ, టికెట్ల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 25 రోజులకు హుండీల ద్వారా రూ.25, 96, 561లక్షల ఆదాయం రాగా, వివిధ రకాల ఆర్జిత టికెట్లపై రూ.96,29,000లక్షల ఆదాయం సమకూరింది. మొత్తం రూ.1,22,25,561కోట్ల ఆదాయం లభించినట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. భక్తులు హుండీల్లో కరెన్సీ నోట్లతోపాటు మిశ్రమ వెండి బంగారు ఆభరణాలు స్వామి వారికి సమర్పించారు. లెక్కింపులో వాటిని పరిశీలించాక నోట్లు చిల్లర నాణేలను బ్యాంక్ అధికారులకు అందజేశారు. మిశ్రమ వెండి, బంగారాన్ని తిరిగి హుండీలోనే భద్రపరిచారు. ఈ లెక్కింపును దేవాదాయశాఖ డివిజన్ పరిశీలకుడు డి.అనిల్‌కుమార్ పర్యవేక్షించారు. కానిస్టేబుళ్లు పరమేశ్వరి, యాస్మిన్, శ్రీనివాస్‌లు బందోబస్తు నిర్వహించారు. మహబూబాద్‌కు చెందిన శ్రీలక్ష్మి, వెంకటేశ్వర సేవా సమితికి చెందిన మహిళలు, అర్చక సిబ్బంది, ఒగ్గు పూజారులు ఎం మహేందర్, అశోక్ తదితరులు లెక్కింపులో పాల్గొన్నారు.

స్మార్ట్ పిటీ!

- వరంగల్ నగరంలో స్మార్ట్ సిటీ పనులకు గ్రహణం
- అధికారుల నిర్లక్ష్యంతో కొనసాగుతున్న పనులు
- 108 పనులకు 77 పూర్తి, 31 పనులు పెండింగ్
- బల్దియా, కుడా శాఖల సమన్వయలోపంతో జాప్యం
- జూన్ 30 వరకు పొడిగింపు ?

వరంగల్ కార్పొరేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో స్మార్ట్ సిటీ నత్తనడకన ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల 9 ఏళ్లుగా కొనసా.గుతూనే ఉన్నాయి. 2024 డిసెంబరు 31 వరకు పూర్తి చేయాల్సిన పనులు చాలా పెండింగ్‌లో ఉండడంతో సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో గడువు పెంచే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరమైన వరంగల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రగతిపథంలో నడపాలని చూస్తున్నా.. ఇక్కడి అధికారులు, కాంట్రాక్టర్ల కుంటి సాకులవల్ల నగర అభివృద్ధి నత్తను తలపిస్తోంది. వరంగల్ నగరంలో 108 పనులకు 77 పూర్తి కాగా, ఇంకా 31 పనులు కొనసాగింపు దశలో ఉన్నాయి. మరో 7 పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వాని పంపించి టెండర్లు పిలిచారు.

2016లో ప్రారంభమైన ఈ పథకం స్వప్నం ఇంకా నెరవేరడం లేదు. వరంగల్ నగరంతో పాటు విలీన గ్రామాల్లో స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టాల్సిన పనులకు ఇంకా కొన్ని చోట్ల ప్రారంభానికి నోచుకోలేదు. జీడబ్ల్యూఎంసీ, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) సంస్థల మధ్య సమన్వయలోపంతో చేపట్టే పనుల్లో జాప్యం జరుగుతోందనే ప్రచారం ఉంది. కొన్ని చోట్ల పనులు జరుగుతున్నా నాసిరకం పనులతో పనులు పూర్తి చేసి కాంట్రాక్టర్లు బిల్లులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్లు, బల్దియా, కుడా అధికారులు కుమ్మక్కై నామమాత్రపు పనులు చేసి నిధులు అందినకాడికి దండుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.964 కోట్లతో పనులు షురూ

కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లలో స్మార్ట్ సిటీ మిషన్ కింద అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాయత్తమయ్యాయి. కేంద్రం, రాష్ట్రం పనులు జరుగుతున్న క్రమంలో ప్రతీ నెల ఆయా ప్రభుత్వాలకు అందించే యుటిలైజేషన్ సర్టిఫికెట్ (యూటీసీ) ఆధారంగా నిధులు మంజూరు చేస్తారు. ఇప్పటివరకు వరంగల్ నగరానికి రూ.599.96 కోట్ల నిధులు మంజూరైనట్లు అధికారులు వెల్లడించారు. దీంతో బల్దియా పరిధిలో ముందస్తుగా 89 రకాల పనులు చేసేందుకు కొటేషన్‌లను సిద్ధం చేసి పంపించారు. తర్వాత నగర సుందరీకరణ, జంక్షన్ల అభివృద్ధి, సీసీ రోడ్లు నిర్మించేందుకు మరిన్ని నిధులు కావాలని ప్రతిపాదనలు చేసి గత యేడాది పంపించారు. మొత్తంగా ఇప్పటి వరకు నగరంతో పాటు విలీన గ్రామాల్లో 108 పనులకు వెయ్యి కోట్లు కావాలని ప్రతిపాదనలు చేసి పంపించారు. కానీ రూ.964 కోట్లకు మాత్రమే ఆమోదం తెలిపినట్లు తెలిసింది. 2025లో మరో 7 పనులకు ప్రతిపాదనలు, అగ్రిమెంట్లు చేసి పంపించారు. ఇంకా బల్దియా పరిధిలో జరిగిన స్మార్ట్ సిటీ పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.365 కోట్ల నిధులు రావాల్సి ఉంది. అయితే ప్రధానంగా రూ.99 కోట్లతో నగరంలో నిఘా కెమెరాల ఏర్పాటు (ఐసీసీసీ)కు, రూ.250 కోట్లతో ఉర్సు గుట్ట, ప్రగతి నగర్, రెడ్డిపురంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం, రూ.76 కోట్లలో భద్రకాళి బండ్ నిర్మాణంలో అభివృద్ధి పనులు, రూ.34 కోట్లతో వడ్డేపల్లి బండ్, రూ.30 కోట్లతో రాంపూర్‌లో బయోమైనింగ్ ప్లాంట్ ఏర్పాటు పనులు, రూ.9 కోట్లతో పబ్లిక్ గార్డెన్ డెవలప్‌మెంట్, రూ.50 కోట్లతో ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్లు, రూ.30 కోట్లతో భద్రకాళి మాడ వీధులతో పాటు నర్సంపేట, ఖమ్మం, ములుగు, కరీంనగర్ ప్రాంతాల నుంచి వరంగల్ నగరానికి వస్తున్న దారుల్లో గ్రాండ్ ఎంట్రెన్స్ ఆర్చ్‌ల నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ఈ పనులు 80 నుంచి 90 శాతం పూర్తయ్యాయని, ఇంకా మరో మూడు నెలల్లో పనులు పూర్తవుతాయని అధికారులు వెల్లడించారు. యేటా రూ.10 కోట్లతో లైటింగ్, గ్రీనరికి ఉపయోగిస్తున్నారు.


కొనసాగుతున్న వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణ పనులు

అధికారుల్లో చలనం వచ్చేనా ?

స్మార్ట్ సిటీ మిషన్ పనుల్లో బల్దియా, కుడా అధికారుల నిర్లక్ష్యంతోనే పనుల్లో జాప్యం జరిగినట్టు ప్రచారం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నా శాఖల మధ్య సమన్వయం ఉండడం లేదని నిఘా విభాగాలు ప్రభుత్వానికి నివేదిక సమర్పించాయి. గత యేడాది జూన్ 30 వరకే స్మార్ట్ సిటీ మిషన్ పథకం ముగిసింది. కానీ చాలా పనులు పెండింగ్‌లో ఉండడం, చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు. ఇదీ గమనించి సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లి కేంద్ర గృహ నిర్మాణాల పట్టణ, వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసి విషయం తెలిపారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి 2025 మార్చి 31 వరకు స్మార్ట్ సిటీ మిషన్ పనులు పూర్తి చేసే అవకాశాన్ని కల్పించారు. కానీ ఇంకా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

అయితే పెండింగ్ పనుల గడువు పెంచాలని ఈ నెల 26న హైదరాబాద్ సెక్రెటేరియట్ కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ అధ్యక్షతన స్మార్ట్‌సిటీ బోర్డు మీటింగ్ జరిగింది. బల్దియా నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర హాజరు కాగా, అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా తూతూ మంత్రంగా సమావేశం జరిగింది. తర్వాత తిరిగి శుక్రవారం (28)న హైదరాబాద్‌లో మీటింగ్ నిర్వహించి వరంగల్ నగరంలో చాలా పనులు పెండింగ్‌లో ఉన్నట్టు అధికారులు ఆధారాలు చూపించడంతో మరో మూడు మాసాలు (జూన్ 30) గడువు పెంచినట్టు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం కొనసాగుతున్న పనులు మాత్రమే పూర్తి చేయాలని, కొత్త పనులకు ప్రతిపాదనలు వద్దని తేల్చి చెప్పినట్టు తెలిసింది. జూన్ వరకు మిగిలిన పనులు పూర్తి చేయకపోతే బల్దియాకు వచ్చే నిధులు వెనక్కి పోతాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే నగరంతో జరుగుతున్న పనులకు రెండుసార్లు గడువు పెంచినా లక్ష్యం చేరకపోవడంతో ఇక్కడి అధికారుల తీరుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లిప్తత వ్యక్తం చేసినట్టు విశ్వసనీయ సమాచారం.

విద్యారంగ సమస్యలపై పోరాడుతా..

- నేను ఏ పార్టీలో చేరను : ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

జఫర్‌గఢ్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాడుతానని వరంగల్-నల్గొండ-ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జఫర్‌గఢ్‌లో పీఆర్‌టీయూ జిల్లా, మండల ప్రతినిధులతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యారంగ పటిష్టతకు జిల్లా, మండల స్థాయిల్లో ప్రభుత్వం పర్యవేక్షణాధికారులను నియమించాలన్నారు. ఏకీకృత సర్వీసు నిబంధనలను రూపొందించి అమలు చేయాలన్నారు. తద్వారా ఎంఈఓలు, జూనియర్ లెక్చరర్స్, డిప్యూటీ ఈఓలు, డైట్, బీఈడీ కళాశాలల లెక్చరర్లను పదోన్నతుల ద్వారా నియమించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విద్యావ్యవస్థలో పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తూ విద్యార్థులకు తగు వసతి సౌకర్యాలతో నాణ్యమైన విద్యనందిస్తూ పిల్లల తల్లిదండ్రుల్లో సర్కారు బడులపై నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ పంచాయతీరాజ్ పాఠశాలల్లో 16.80లక్షల మంది విద్యార్థులు మాత్రమే విద్యనభ్యసిస్తున్నారన్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యనందించేందుకు ఉపాధ్యాయులకు ఆంగ్లమాధ్యమం, ఆయా అంశాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులకు నష్టం కలిగించే సీపీఎస్‌ను రద్దు చేస్తామని, ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ అమలుతోపాటు పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయుల గొంతుకగా శాసనమండలిలో వినిపిస్తానన్నారు. తాను ఏ రాజకీయ పార్టీలో చేరబోనని శ్రీపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. కాగా, అంతకుముందు మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు పోతు రాజిరెడ్డి పదవీ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి పాల్గొని రాజిరెడ్డి దంపతులను సన్మానించారు. ఈ సమావేశాల్లో పీఆర్‌టీయూ జనగామ, హనుమకొండ, ములుగు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.మహిపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, యాకూబ్‌రెడ్డి, జఫర్‌గఢ్, ఐనవోలు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సీతారామయ్య, రామారావు, రాజు, చంద్రమోహన్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు

సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాలి

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను మరింతగా బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డీసీవోలు, డీసీసీ బ్యాంకు అధికారులకు సూచించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జిల్లాస్థాయి సాధికార కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాల బలోపేత చర్యలు, సమస్యల పరిష్కారం, జీవో 44 అమలు తదితర అంశాలను సమీక్షించారు. అనంతరం ఇటీవలే డీసీవోగా బాధ్యతలు చేపట్టిన సంజీవరెడ్డిని సన్మానించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని డీసీవోలు నీరజ, రాజేందర్‌రెడ్డి, సర్దార్‌సింగ్, డీసీసీబీ సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషశ్రీ, డైరెక్టర్ జగన్‌మో హన్‌రావు, డీజీఎం అశోక్, మహబూబాబాద్ ఏఆర్ సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవైష్ణవ పండితుడు నారాయణస్వామి కన్నుమూత



హనుమకొండ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కొత్తూరు ప్రాంతానికి చెందిన శ్రీవైష్ణవ పండితుడు, వైష్ణవ సంప్రదాయానికి సంబంధించి అనేక గ్రంథాలను ప్రకటించిన విశ్రాంత ఉపాధ్యాయుడు రామానుజం (మడికొండ) నారాయణస్వామి (91) శనివారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన ఉత్తమ ఉపాధ్యాయుడిగా అనేక అవార్డులను అందుకోవడమేకాక సంప్రదాయ పండితుడిగా శ్రీవైష్ణవ ఆచార్యుడిగా ఆయన పొందిన సత్కారాలు అనేకం. ఆయన కోరికపై మృతి చెందిన అనంతరం పార్థీవదేహాన్ని వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థుల కోసం దానం చేయడం విశేషం. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, హనుమకొండ జిల్లా ప్రతినిధి శంకర్‌రావు ఆధ్వర్యంలో కేఎంసీకి అప్పగించారు. నారాయణస్వామి మృతి పట్ల అనేక మంది చాత్తాద శ్రీవైష్ణవ నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న కృష్ణ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్-1 బోగీలో పొగలు రావడంతో రైలును డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో 15 నిమిషాల పాటు శనివారం సాయంత్రం నిలిపివేశారు. దీంతో సమాచారం తెలుసుకున్న రైల్వే సీఎన్‌డబ్ల్యూ సిబ్బంది బోగీ వద్దకు చేరుకుని, రైలును పరిశీలించారు. బ్రేక్ పట్టివేయడంతోనే పొగలు వచ్చినట్లు తెలిసింది. సిబ్బంది బ్రేక్‌ను సరిచేసిన అనంతరం రైలును యథావిధిగా పంపించారు. తొలుత విజయవాడ సమీపంలోని కొండపల్లి వద్ద ఇంజన్ ప్యాంట్ రాపిడికి గురికావడంతో రైలు ఇంజన్ ఆగిపోయింది. దీంతో అక్కడ సైతం మరో ఇంజన్‌ను అమర్చి రైలును పంపించారు. రెండు సంఘటనలతో కృష్ణ ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడిచింది.

కో-ఆర్డినేటర్లు పార్టీ బలోపేతానికి పనిచేయాలి

వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, చిత్రంలో కాంగ్రెస్ నాయకులు

వరంగల్ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పార్టీని బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ (టీపీసీసీ) ఆదేశానుసారం 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్' మండలాలకు కో-ఆర్డినేటర్లను నియమిస్తున్నామని, మండల కో-ఆర్డినేటర్లు పూర్తిస్థాయిలో పని చేసి ప్రభుత్వ సంక్షేమ కార్య క్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. నగరంలోని రాంకీ సిటీలో శనివారం 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ నివాసంలో విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏప్రిల్ 2న మొదలయ్యే 'జై బాపు, జై భీం, జై సంవిధానం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కోఆర్డినేటర్లు స్థానిక నాయకులను కలుపుకుని గడపగడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని, ఎప్పటికప్పుడు రిపోర్టు పంపించాలన్నారు. మండలాల వారిగా నియమితులైన కోఆర్డినేటర్ల వివరాలు ప్రకటించారు. నర్సంపేట రూరల్‌కు బస్వరాజు శ్రీమాన్, నర్సంపేట టౌన్‌ను గుండేటి నరేంద్రకుమార్, చెన్నారావుపేటకు జన్ను రవి, దుగ్గొండికి గోరంటల రాజు, నల్లబెల్లికి బిల్లా శ్రీకాంత్, నెక్కొండకు కరాటే ప్రభాకర్, ఖానాపురంనకు తత్తరి లక్ష్మణ్, వర్ధన్నపేటకు జనగామ రమేష్, పర్వతగిరికి దుబ్బాక సంతోష్, వరంగల్‌కు వజ్ర రాజు, ఖిలా వరంగల్‌కు ఆకుల రుద్రప్రసాద్, గీసుగొండకు నరుకుడు వెంకటయ్య, సంగెంకు మాసాని యాకూబ్, రాయపర్తికి ఎం.డి. అఫ్సర్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో బస్వరాజు శ్రీమాన్, కురవి పరమేశ్వర్, తత్తరి లక్ష్మణ్, దామెర సర్వేషం, బిల్లా శ్రీకాంత్, జన్ను రవి, గోరంటాల రాజు, చాగంటి శ్రీనివాస్, అనిల్, దామోదర్, కరాటే ప్రభాకర్, వేణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుట్కాలు పట్టివేత

వరంగల్ క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిషేధిత గుట్కాలను మడికొండ, నల్లబెల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. మడికొండ పీఎస్ పరిధిలోని నెహ్రూనగర్‌లో ఎం.డి. సోహెల్ వద్ద రూ.33,290 విలువ చేసే వివిధ రకాల గుట్కాలను పట్టుకున్నామన్నారు. అదేవిధంగా ఈస్ట్ జోన్‌లోని నల్లబెల్లి పీఎస్ పరిధిలో బచ్చు రాజయ్య వద్ద రూ.15,090 విలువ చేసే గుట్కాలను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు.

భారత్ గౌరవ్ సప్త జ్యోతిర్లింగాల దర్శనయాత్ర

ఏప్రిల్ 8 నుంచి 19 వరకు రైలు పర్యటన

గిర్మాజిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): భారత రైల్వే అనుబంధ ఇండియన్ రైల్వే క్యాటరింగ్, టూరిజం కార్పొరేషన్ (ఐ.ఆర్.సి.టి.సి) భారత్ గౌరవ్ రైలు ఏప్రిల్ 8 నుంచి 19 వరకు సప్త జ్యోతిర్లింగాల యాత్రను నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ మార్కెటింగ్ అధికారి ఓ.నరేష్‌బాబు తెలిపారు. వరంగల్ రైల్వేస్టేషన్ వీఐపీ లాంజ్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఐఆర్‌సీటీసీ టూర్ మానిటర్ ప్రశాంత్‌తో కలిసి ఐఆర్‌సీటీసీ మార్కెటింగ్ అధికారి నరేష్‌బాబు దర్శన యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నరేష్‌బాబు మాట్లాడుతూ.. అత్యంత ప్రాశస్త్యమైన ఏడు జ్యోతిర్లింగాల దర్శనం కోసం ప్రత్యేకంగా ఏప్రిల్ 8 నుంచి 19 వరకు భారత్ గౌరవ్ రైలు పర్యాటక టూర్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 11 రాత్రులు 12 పగలుగా సాగే ఈ యాత్రలో ఉజ్జయిని మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, ద్వారకా నాగేశ్వర్, సోమనాథ్ సోమేశ్వర్, పూణే భీమశంకర్, నాసిక్ త్రియంబకేశ్వర్, ఔరంగాబాద్ గ్రిష్ణేశ్వర్‌ల దర్శనం ఉంటుందని చెప్పారు. ఈ యాత్రకు స్లీపర్ క్లాస్ చార్జీ రు.20,890లు, పిల్లలకు (5-11 సంవత్సరాలలోపు) రు.19.555లు, 3ఏసీ తరగతి చార్జీ రూ.33,735లు, పిల్లలకు రూ.32,160లు, 2 ఏసీ తరగతి చార్జీ రూ.44,375లు, పిల్లలకు రూ.42,585లు ఉంటుందని ఆయన తెలిపారు. ప్రతీ రోజు బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, దర్శన ప్రాంతాల్లో వాహనసదుపాయం, వసతి ఈ చార్జీలలోనే ఉంటుందని ఆయన చెప్పారు. అలాగే ప్రతీ ప్రయాణికుడికి భద్రత, ఇన్సూరెన్స్ సదుపాయం, ప్రతీ కోచ్‌కు టూర్ గైడ్ ఉంటారని తెలిపారు. ప్రయాణంలో ఎవరికైనా అనారోగ్యం కలిగినా వెంటనే తగిన వైద్య సదుపాయం ఉంటుందని నరేష్ బాబు తెలిపారు.

సప్త జ్యోతిర్లింగాల దర్శన యాత్ర రైలు ఏప్రిల్ 8న విజయవాడలో రాత్రి 9 గంటలకు బయలుదేరి 11 గంటలకు చేరుకుని అక్కడ ప్రయాణికులను ఎక్కించుకుని అర్ధరాత్రి 1.45 గంటలకు కాజీపేటకు చేరుకుంటుందన్నారు. జ్యోతిర్లింగాల దర్శనయాత్ర అనంతరం ఏప్రిల్ 19 మధ్యాహ్నం 12 గంటలకు కాజిపేటకు చేరుకుంటుందని ఆయన తెలిపారు. అందుబాటులో ఉన్న చార్జీలతో 7 జ్యోతిర్లింగాలను దర్శించుకునే ఈ యాత్రకు వెళ్లే భక్తులు ఐఆర్‌సీటీసీ సికింద్రాబాద్ మొబైల్ నెంబర్లు 92810 30712/92810 30711లను సంప్రదించాలన్నారు. దర్శనయాత్రకు టికెట్‌లు బుక్ చేసుకోవాలని ఆయన కోరారు. ఈ ప్రత్యేక రైలులో స్లీపర్ 460 బెర్త్‌లు, 3ఏసీ 206 బెర్త్‌లు, 2ఏసీ 52 బెర్త్‌లు ఉన్నాయని వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజలు ఈ యాత్రను వినియోగించుకోవాలని ఆయన కోరారు.



వరంగల్‌లో యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఆర్‌టీసీ మార్కెటింగ్ అధికారి నరేష్‌బాబు

విశ్వావసు ఉషస్సులో..



నేడు ఉగాది పర్వదినం

- తెలుగు కొత్త సంవత్సరం ప్రారంభం
- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు
- పూజా సామగ్రి కొనుగోలుతో సందడిగా కూడళ్లు


హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల కొత్త సంవత్సరం ఉగాది పర్వదినం చైత్ర శుద్ధ పాడ్యమి ఆదివారం రోజున ప్రజలు జరుపుకోనున్నారు. ఈ ఏడాది ఉగాది పర్వదినం శ్రీవిశ్వావసు నామంతో ప్రారంభమవుతుంది. చైత్రమాసం కొత్త సంవత్సరం ఆదివారంతో ప్రారంభమవుతుంది. కొత్త సంవత్సరం సందర్భంగా మామిడి తోరణాలతో, పూల మాలలతో తమ ఇంటిని అలంకరించుకొని దేవాలయాలను కూడా అలంకరించి కొత్త సంవత్సరం ఆలయ దర్శనాలు చేసుకోవడం సంప్రదాయంగా భావిస్తారు.

పచ్చడి

ఉగాది పర్వదినం రోజున కష్టం, సుఖం, తీపి, చేదు, ఒగరు రుచులతో షడ్రుచుల పదార్థాలతో తయారు చేసిన మిశ్రమాన్ని ప్రసాదంగా స్వీకరిస్తారు. కొత్త సంవత్సరం ఉగాది రోజున ఉగాది పచ్చడి తీసుకోవడం ప్రతీ ఒక్కరి ఇంట్లో ఆచారంగా వస్తున్న పండుగ. చైత్రమాసంలో ప్రకృతి సిద్ధపరంగా కొత్త చింతపండు, కొత్తగా కాసిన మామిడికాయ, వసంత రుతువులో పూజిన యాపపువ్వు, మంచినీరు, బెల్లంతో కలిపి జీవితంలో ఒడిదొడుకులు సుఖ దుఃఖాల మాదిరిగా అన్ని కలిపితే ఒకే విధంగా ఉండడంగా కొత్త సంవత్సరం రోజున ఉగాది పచ్చడిని కొత్త కుండలో తయారు చేసుకొని ప్రతీ ఇంట్లో పచ్చడి స్వీకరిస్తారు. కొత్త కుండలో చింతపండు, మామిడికాయ, బెల్లం, వేప పువ్వు, మంచినీటి ద్రవంతో పచ్చడి పదార్థాన్ని తయారు చేసి ఉగాది రోజున నూతన వస్త్రాలు ధరించి పచ్చడి స్వీకరించి పండుగ స్పెషల్ అయిన బొబ్బట్లు (భక్షాల)ను పిండి పదార్థాలను ఇంటిల్లిపాది ఆనందంగా ఆరగిస్తారు.

పంచాంగ శ్రవణాలు

ఉగాది కొత్త సంవత్సరం ప్రారంభం సందర్భంగా రాబోయే సంవత్సర కాలంలో తమ రాశీఫలాలు ఎలా ఉన్నాయనేది పంచాంగశ్రవణం ద్వారా పండితులు ఉగాది రోజున శ్రవణం చేస్తారు. జిల్లాలోని చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారి దేవాలయం, గీతాభవన్, బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వరాలయం, ఎల్లంబజార్‌లోని రామాలయం, ఎంజీరోడ్డులో గల గోపాలస్వామి గుడి, గురుధామం, వాసవీమాత దేవాలయం, దత్తక్షేత్రం, శివనగర్‌లోని రామాలయం, కాశీబుగ్గ దేవాలయం, ఆకారపు వారి గుడితో పాటు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు.



వేయిస్తంభాల ఆలయంలో..

ఉగాది పర్వదిన వేళ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో సాయంత్రం ఐనవోలు రాధాకృష్ణ సిద్ధాంతిచే పంచాంగ శ్రవణం, తాడూరి రేణుక శిష్యబృందంచే సాంస్కృతిక సంప్రదాయ నృత్యాలు, ప్రత్యేక 12 మంది కవులతో ప్రత్యేక కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రారంభిస్తారని వారు చెప్పారు. పది రోజులపాటు జరిగే శ్రీరామ నవమి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ఇక్కడ ఆరంభం కానున్నాయి.



హనుమకొండ చౌరస్తాలో ఉగాది పండుగ సందర్భంగా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

పూజా సామగ్రి కొనుగోలు సందడి

ఉగాది పర్వదినం సందర్భంగా పూజా సామగ్రి అమ్మకాలు జోరుగా సాగుతాయి. ఈ మేరకు శనివారం నగరంలో పెద్ద ఎత్తున పూలు, పండ్లు, మామిడి కాయలు, కొత్త చింతపండు, వేప పువ్వు, మామిడి ఆకు, ఇతర పూజా సామగ్రిని ప్రజలు కొనుగోలు చేశారు. వరంగల్ చౌరస్తా, స్టేషన్ రోడ్డు, పోస్టాఫీస్ సెంటర్, బట్టల బజార్, చమన్, జేపీఎన్ రోడ్డు, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, రంగశాయిపేట, తదితర ప్రాంతాల్లో పూజ సామగ్రి అమ్మకాలు జోరందుకున్నాయి. ఎక్కడ చూసినా తోరణాలు కట్టేందుకు మామిడాకులు, బంతిపూల అమ్మకాలు, పచ్చడి తయారు చేసుకునేందుకు కుండలు, రంజన్లతో నగరమంతా ఉగాదిమయమైంది.

ప్రముఖుల శుభాకాంక్షలు

ఉగాది నూతన తెలుగు సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ ఎంపీ కడియం కావ్య కోరారు. ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఉగాది పండుగను జిల్లా ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. తెలిపారు.

కవి సమ్మేళనాలు

ప్రత్యేక కవి సమ్మేళనాలు, పంచాంగ శ్రవణాలు రెండు రోజులుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం పర్వదిన వేళ కూడా అనేక చోట్ల కవి సమ్మేళనాలు ఏర్పాటు అయ్యాయి. హనుమకొండలోని సహృదయ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వడ్డెపల్లి రోడ్‌లోని పీఆర్.రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో విశ్వావసు ఉగాది వేడుకలు పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు గిరిజా మనోహర్‌బాబు, కార్యదర్శి కుందావజ్జుల కృష్ణమూర్తి చెప్పారు. నమిలిగొండ విశ్వేశ్వరశర్మచే పంచాంగ పఠనంతోపాటు స్వరవిపంచి పేరిట సిద్ధిపేటకు చెందిన శశిధర్‌శర్మ బృందంచే ప్రత్యేక లలిత సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా రంగశాయిపేటలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో చేపూరి శ్రీరామ్ అష్టవధానంతోపాటు ప్రత్యేక ఉగాది సమ్మేళనం నిర్వహిస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో హిందూ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విశ్వావసు నామ ఉగాది వేళ పంచాంగ శ్రవణాలు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. టీటీడీ కల్యాణ మండపంలో యోగా గురువు బాబురావు, ధర్మప్రచార మండలి సభ్యులు దేవేందర్‌రెడ్డి, టీటీడీ కల్యాణ మండప మేనేజర్ రఘువీర్‌లతో కలిసి ఈ సందర్భంగా కార్యక్రమ వివరాల పత్రిక ఆవిష్కరించారు. సముద్రాల శఠగోపాచార్యచే టీటీడీ కల్యాణ మండపంలో ప్రంచాంగ శ్రవణం ఉంటుందని ఉమ్మడి జిల్లాలోని ఆరు కేంద్రాల్లో ప్రత్యేక పంచాంగ శ్రవనాలు నిర్వహిస్తున్నట్లు కృష్ణమూర్తి తెలిపారు.



కేయూ బడ్జెట్ రూ.428.82 కోట్లు



వర్సిటీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్



కేయూ అకడమిక్ సెనెట్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రొఫెసర్ సురేశ్‌లాల్, ఎఫ్‌ఓ రాజయ్య

కేయూ క్యాంపస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ 2025-26 ఏడాది బడ్జెట్ రూ.428.82కోట్లతో అంచనా బడ్జెట్‌ను ప్రతిపాదించింది. వర్సిటీకి వచ్చే ఆర్థిక ఏడాదిలో ప్రభుత్వ ప్రభుత్వ గ్రాంట్ల రూపంలో రూ.195.62కోట్లు, అలాగే ఇతర వనరుల నుంచి రూ.170.55 కోట్ల మేరకు వనరులు వస్తాయని అంచనాలు వేశారు. వీటిలో వర్సిటీ ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనలు, భత్యాలు, నిర్వహణ ఖర్చులు, పరీక్షలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ఇతర ఖర్చులకు రూ.369.21కోట్లకు అంచనాలు రూపొందించారు. వర్సిటీ లోటు బడ్జెట్ రూ.2.45కోట్లుగా చూపారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత జరిగిన 40వ అకడమిక్ సెనెట్ సమావేశం జరిగింది. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పాలకమండలి సభ్యులు డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ కారుకాల అనితారెడ్డి, డాక్టర్ పుల్లూరు సుధాకర్, అడ్వకేట్ బాలు చౌహన్, డాక్టర్ బి.రమ, డాక్టర్ సుకుమారి, డాక్టర్ నవీన్‌తో పాటు అకడమిక్ సెనెట్ సభ్యులు డాక్టర్ అంపశయ్య నవీన్, మాణిక్యం, మాజీ వీసీలు ప్రొఫెసర్ వంగాల గోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎన్.లింగమూర్తి, ప్రొఫెసర్ విద్యావతితో పాటు డీన్లు, ఇతర పరిపాలన అధికారుల సమక్షంలో బడ్జెట్ ప్రవేశపెట్టారు.

సభలో కేయూ అర్థశాస్త్ర విభాగాధిపతి, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ వర్సిటీ బడ్జెట్‌ను ప్రతిపాదించారు. మొత్తంగా బడ్జెట్ రూ.428.82 కోట్లుగా ప్రతిపాదించగా, అందులో ఖర్చులకు రూ.369.21 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్స్ రూపంలో రూ.195.62 కోట్లుగా ప్రతిపాదించారు. వర్సిటీకి ఇతర వనరుల నుంచి రూ.170.55 కోట్ల రాబడి వస్తోందని అంచనాలు వేశారు. వీటిలో యూజీసీ ఏరియర్స్‌గా రూ.32.81కోట్లు, అకడమిక్, ట్యూషన్ ఫీజులు రూ.8కోట్లు, అంతర్గత వనరుల రూపంలో రూ. 41.80 కోట్లు, పరీక్షల విభాగం నుంచి రూ.50.06కోట్ల మేరకు వర్సిటీకి ఆర్థిక వనరులు సమకూరుతాయని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. బడ్జెట్‌ను మొత్తంగా 8 విభాగాలుగా ప్రొఫెసర్ సురేశ్‌లాల్ చూపారు. రూ.2.45 కోట్లు లోటు ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఉద్యోగుల జీతాలు, పెన్షన్‌లకు రూ. 211.41కోట్లు, నిర్వహణ కార్యక్రమాలకు రూ.8.80కోట్లు, పరీక్షలకు రూ. 50.06 కోట్లు మేరకు నిధులను కేటాయించినట్లు వివరించారు. అకడమిక్ కార్యక్రమాలకు రూ.8.36కోట్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు రూ.84.38 కోట్లు నిధులను వెచ్చిస్తున్నట్లు స్పష్టం చేశారు. బడ్జెట్‌పై చర్చల్లో పాల్గొన్న పాలక మండలి సభ్యులు, డీన్లు, ఇతర పరిపాలన అధికారులు కేయూ 2025-26 బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు.

కేయూను డిజిటలైజేషన్ చేస్తాం..

కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ 2026లో స్వర్ణోత్సవ సంబురాలకు సిద్ధమవుతోందని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి వెల్లడించారు. శనివారం కేయూ 40వ అకడమిక్ సెనెట్ సమావేశంలో అధ్యక్షత వహించి కీలక రిపోర్టును సమర్పిస్తూ ప్రసంగించారు. వర్సిటీ అభివృద్ధిలో అందరి కృషి ఉందన్నారు. బాధ్యతతో వర్సిటీని మరింత ముందుకు తీసుకుపోదామన్నారు. నూతన విద్యావిధానంలో భాగంగా కొత్త కోర్సులను తెస్తామన్నారు. బోర్డు ఆఫ్ స్టడీస్‌లను బలోపేతం చేస్తామని, వర్సిటీని డిజిటలీకరణ చేస్తామన్నారు. 10 ఏళ్లలో వర్సిటీలో 3వేల రీసెర్చ్ పేపర్లు గొప్ప జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయన్నారు. 5 ఏళ్లలో 65 పరిశోధన ప్రాజెక్టులతో పాటు 85 మంది స్టూడెంట్స్ జాతీయ అర్హత పరీక్షల్లో ప్రతిభ చూపారని పేర్కొన్నారు. రుసా నిధులు, ప్రాజెక్టులతో పాటు డిపార్టుమెంట్ ప్రాజెక్టులు వచ్చాయన్నారు. కె-హబ్‌ను ఉపయోగంలోకి తెస్తామని చెప్పారు. 6వ జనరేషన్, మెషిన్ లర్నింగ్, మార్కెట్ ఓరియంటేషన్ కోర్సులను తెస్తామన్నారు. న్యాక్ ఏ ప్లస్, ఎన్ఐఆర్ఎఫ్, యూఐ గ్రీన్ మెట్రిక్ ర్యాంకులు సాధించమని పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలోని కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో అలూమినీ సహకారంతో అకడమిక్ బ్లాక్‌ను నిర్మించినట్లు తెలిపారు. జెన్‌కో రూ.కోటి, ఇన్ఫోసిస్ 300 కంప్యూటర్లను అందచేసినట్లు చెప్పారు. హరితహారంలో 11వేల మొక్కలు, ఎన్ఎస్ఎస్‌లో రక్తదాన శిబిరాలు నిర్వహించమన్నారు. ఇంజనీరింగ్, కామర్స్ కళాశాలలో 285 మంది విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్‌లో ఉద్యోగాలు సాధించినట్లు వెల్లడించారు.

అలాగే మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సెలబస్‌లో మార్పులు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేస్తామని వీసీ పేర్కొన్నారు. విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా టీచింగ్ ఏర్పాట్లు చేస్తామని, నూతన నియామకాలు చేపడుతామని పేర్కొన్నారు. అలూమినీలను బలోపేతం నిధులను సేకరిస్తామన్నారు. అలూమినీ ఫండ్, కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామన్నారు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.293కోట్లతో డీపీఆర్‌ను సిద్ధం చేశామని వెల్లడించారు. బోధన, పరిశోధనపై శ్రద్ధ వహించాలని వీసీ సూచించారు.



మాజీ వీసీ ప్రొఫెసర్ విద్యావతి



మాజీ వీసీ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి



మాజీ వీసీ ప్రొఫెసర్ లింగమూర్తి



సెనెట్ సభ్యుడు అంపశయ్య నవీన్



పాలక మండలి సభ్యుడు పుల్లూరి సుధాకర్

బడ్జెట్ వాస్తవికంగా రూపొందించాలి

కేయూ బడ్జెట్ వాస్తవికం గా రూపొందించాలని కేయూ పాలక మండలి సభ్యులు పుల్లూరి సుధాకర్ సూచించారు. శనివారం కేయూ బడ్జెట్‌పై జరిగిన చర్చల్లో పాల్గొని కీలక సూచనలు, సలహాలను ఇచ్చారు. బడ్జెట్ సంప్రదాయక పద్ధతులపై ఆధారపడకుండా, ఇతర వనరుల నుంచి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. మరో పాలక మండలి సభ్యులు, అడ్వకేట్ బాలు చౌహన్ మాట్లాడుతూ.. గతంలో పోల్చితే తాజాగా ప్రభుత్వం కేయూకిచ్చిన బ్లాక్‌గ్రాంట్ ఆశాజనకంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో రాష్ట్రంలోనే వర్సిటీని టాప్‌కు తీసుకుపో వాలని అన్నారు. విద్యార్థులలో భవిష్యత్‌లో మార్పులు తీసుకువచ్చేందు కు అధ్యాపకులు మరింతగా కృషి చేయాలన్నారు. ఈసీ మెంబర్ డాక్టర్ కారుకల అనితారెడ్డి మాట్లాడుతూ.. వర్సిటీలో అనేక పరిమితుల మధ్య బడ్జెట్‌ను గొప్పగా రూపొందించారని పేర్కొన్నారు. వర్సిటీని రక్షించుకో వాలని కోరారు. పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజుగౌడ్ మాట్లాడుతూ.. బ్లాక్ గ్రాంట్ పెంచినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ వీసీ ప్రొఫెసర్ విద్యావతి మాట్లాడుతూ.. వర్సిటీలో ప్రొఫెసర్ల సంఖ్య తగ్గిపోతుందని, విభాగాధిపతులు కాంట్రాక్టు అధ్యాపకులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డు ప్రొఫెసర్లకు రీసెర్చ్ అవకాశం కల్పించాలని కోరారు. మాజీ వీసీ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో పోలిస్తే తాజా ప్రభుత్వానికి వర్సిటీలపై సానుకూల దృక్పథం ఉందన్నారు. ఎస్డీఎల్‌సీఈ, ఎస్ఎఫ్‌సీ కోర్సులను బలోపేతం చేయాలన్నారు. టీం వర్క్‌తో వర్సిటీ అభివృద్ధికి కృషి జరుగాలని పేర్కొన్నారు. మాజీ వీసీ ప్రొఫెసర్ ఎన్.లింగమూర్తి మాట్లాడుతూ.. నియామకాలు జరగాలని, బ్లాక్‌గ్రాంట్ పెరుగాలని అన్నారు. నాణ్యమైన విద్య అందించాలన్నారు. ప్రముఖ రచయిత, సెనెట్ సభ్యుడు డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. స్మారక ఉపన్యాసాలను ఏటేటా నిర్వహించేలా చూడాలనిన్నారు. సెనెట్ సభ్యుడు మాణిక్యం, సైన్స్ డీన్ ప్రొఫెసర్ జి. హన్మంతు, ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ రాంనాథ్‌కిషన్‌లు మాట్లాడుతూ.. వర్సిటీ అభివృద్ధిపై కీలక సూచనలు చేశారు.

ఈ సమావేశంలో డీన్లు ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, గాదె సమ్మయ్య, ఎం.శ్రీనివాస్, మంచాల సదానందం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాజేందర్ కట్ల, యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జునరెడ్డి, అకూట్ అధ్యక్షులు ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి, ప్రిన్సిపాల్ సుంకరి జ్యోతి, తిరుమలదేవి, వెంకయ్య, ఈసం నారాయణ, తదితరులు పాల్గొన్నారు. సభలో రిటైర్డు కానున్న తోట రాజయ్య దంపతులను సన్మానించారు.

సర్వర్ డౌన్..



రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్న సంగెంలోని మీ సేవా కేంద్రం

- మీ సేవా కేంద్రాల్లో సర్వర్ సమస్య
- ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం
- తిరుగుతున్న యువవికాస దరఖాస్తుదారులు
- ఏప్రిల్ 5కు గడువు పూర్తి

హనుమకొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో వారం రోజులుగా మీసేవా కేంద్రాల్లో సర్వర్లు పని చేయడం లేదు. ఏ ధృవీకరణ పత్రాలు జారీ కావడం లేదు. రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తులు చేసుకునేందుకు కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాల కోసం నిరుద్యోగ యువతీ యువకులు మీ సేవా కేంద్రాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అయినా ఫలితం ఉండడం లేదు. సైట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యను పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపడం లేదు.

అన్నిటికీ మీ సేవా కేంద్రమే..

కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు మొదలు కొని స్కాలర్‌షిప్‌ల వరకు ఇలా ప్రతీ అవసరానికి దరఖాస్తు చేసుకోవాలంటే మీ సేవా కేంద్రానికి వెళ్లక తప్పదు. మీ సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాతే సంబంధిత కార్యాలయాల నుంచి ధృవీకరణ పత్రాలు జారీ అవుతాయి. ఈ సర్టిఫికెట్లను కూడా మీ సేవా కేంద్రాల నుంచే తీసుకోవాల్సి ఉంటుంది. ఈప్రక్రియ ఉమ్మడి జిల్లాలో వారం పాటు దాదాపుగా నిలిచిపోయింది.

సర్వర్ డౌన్

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే మీ సేవా కేంద్రాల్లో వారం రోజులుగా సర్వర్ ఏకారణం వల్ల డౌన్ అయింది సమాధానం దొరకని ప్రశ్నగా మిగిలిపోయింది. ఏ మీ సేవా కేంద్రానికి వెళ్లినా ఆపరేటర్లు 'సారీ.. సర్వర్ డౌన్ అయింది..' అని చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. వివిధ ధృవీకరణ పత్రాల కోసం వచ్చిన విద్యార్థులు, యువతీ యువకులు ఎంతసేపు ఎదురు చూసినా సర్వర్లు తిరిగి పని చేయడం లేదు, సర్టిఫికెట్ల కోసం వచ్చిన వారితో అన్ని కేంద్రాలు కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. రాజీవ్ యువ వికాస పథకం కోసం దరఖాస్తులు చేసుకునే గడువు దగ్గర పడుతుండడం, అవసరమైన ధృవీకరణ పత్రాలు జారీ కాకపోవడంతో యువకులు ఆందోళన పడుతున్నారు. భూ సంబంధిత రికార్డులు, ఇతరత్రా అవసరాల కోసం మీ సేవా కేంద్రాలకు వెళుతున్న వారికి కూడా నిరాశే ఎదురవుతున్నది. కొత్తగా దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతుండగా ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు రెవెన్యూ కార్యాలయాల నుంచి తీసుకోవాల్సిన ధృవీకరణ పత్రాలు కూడా తీసుకునే పరిస్థితి లేదని వాపోతున్నారు. రోజు ఉదయం, సాయంత్రం మీ సేవా కేంద్రాల చుట్టూ తిరగడమే సరిపోతున్నదని అంటున్నారు.


చేతులెత్తేస్తున్న నిర్వాహకులు

సమస్య ఏమిటో మీ సేవా కేంద్రాల నిర్వాహకులు చెప్పలేకపోతున్నారు. సర్వర్‌లో లోపాలు ఉన్నాయని, లేదా సైట్‌లో సాంకేతిక సమస్య ఉందనో, అప్‌డేట్ చేసే పనిలో యంత్రాంగం ఉందనో అనుకోవడం తప్పా ఎవరూ సరైన సమాచారం ఇవ్వడం లేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సర్వీస్‌ను మీ సేవకు అనుసంధానించిన అధికారులు సమస్య ఏమిటో చెప్పకపోవడంతో దరఖాస్తుదారులతో చీవాట్లు పడాల్సి వస్తోందని నిర్వాహకుల వాపోతున్నారు. సైట్‌లో సమస్య వల్ల అన్ని మీ సేవా కేంద్రాల్లో గుట్టగుట్టలుగా దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. కుల, ఆదాయ, ధృవీకరణ పత్రాల దాఖలు కోసం చేసిన కొందరి దరఖాస్తులు ఆమోదం పొందినట్లు సందేశం వచ్చినా సర్వర్లో సమస్యతో సర్టిఫికెట్ మాత్రం డౌన్‌లోడ్ కావడం లేదు. హైదరాబాద్ మీసేవా స్టేట్ డాటా సెంటర్ (ఎస్‌డీఎస్)లో తలెత్తిన సాంకేతిక సమస్యే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

మీ సేవా కేంద్రాల్లో 38 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 204 రకాల సేవలు ప్రజలకు అందిస్తున్నారు. ఆ సేవల్ని పొందాలంటే మీ సేవ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కుల, ఆదాయ, నివాసపత్రాలతో పాటు రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఈసీ పొందాలంటే సమీప సేవా కేంద్రాల్లో అందుకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలి. తహసీల్దార్ కార్యాలయాల్లో మాన్యువల్‌గా అందించే తొమ్మిది రకాల సర్టిఫికెట్లను సైతం ఇటీవల మీ సేవలో అందుబాటులోకి తెచ్చారు.

గడువు దాటుతోంది..

రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 5 చివరి తేదీ. ఆ తర్వాత ఏప్రిల్ 6 నుంచి 30 వరకు దరఖాస్తులను పరిశీలిస్తారు. అర్హులైన లబ్ధిదారులకు జూన్ 2న తెలంగాణ అవిర్భావ దినోత్సవం సందర్భంగా మంజూరు పత్రాలు అందజేస్తారు. ఈ పథకం కింద నిరుద్యోగ యువతకు రూ. 3 లక్షల వరకు ఆర్థిక సాయం అందజేస్తారు. ఈ పథకం కింద దరఖాస్తుతో పాటు తప్పనిసరిగా సమర్పించాల్సిన ధృవీకరణ పత్రాల్లో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు ఉన్నాయి. ముఖ్యంగా దరఖాస్తుదారు తెలంగాణ శాశ్వత నివాసి అయి ఉండాలి. ఈ నివాస ధృవీకరణ పత్రం కొత్తగా తీసుకోవాలంటే వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. అగ్రికల్చర్ యూనిట్‌కు దరఖాస్తు చేస్తే పట్టాదారు పాస్ బుక్ ఉండాలి. ట్రాన్స్‌పోర్టు వాహనానికి దరఖాస్తు చేస్తే డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి. దివ్యాంగ అభ్యర్థులైతే సదరం సర్టిఫికెట్ జత చేయాలి. ఆన్‌లైన్ అప్లికేషన్ పూర్తయ్యాక దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని ఎంపీడీవో లేదా మున్సిపల్ లేదా జోనల్ కార్యాలయాల్లో ఇవ్వాలి. ఇదంతా జరగాలంటే ముందు మీ సేవా కేంద్రాల్లో నుంచి ధృవీకరణ పత్రాలు రావాలి. అవి రావడంలో జాప్యం జరుగుతోంది. ఈ దృష్ట్యా దరఖాస్తుల దాఖలు గడువును పొడిగించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.



విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

కేయూ క్యాంపస్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని ఎన్నికల్లో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లో ఎస్ఎఫ్ఐ 3వ జిల్లా మహాసభలు జరిగాయి. సీతారాంఏచూరి ప్రాంగణం సుందరయ్య భవన్‌లో జరిగిన సభలకు ముఖ్యఅతిథిగా దామెర కిరణ్ హాజరై మాట్లాడారు. కేయూ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, కోఠారి కమిషన్ సిఫార్సుల మేరకు బడ్జెట్‌లో 30 శాతం నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతీ మండల కేంద్రంలో అంతర్జాతీయ స్థాయి స్కూల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అద్దెభవనాల్లో నడుస్తున్న గురుకుల పాఠశాలలకు అద్దె చెల్లించాలని అన్నారు. పాఠ్యపుస్తకాలను సకాలంలో ముద్రించి విద్యార్థులకు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియాంబర్స్‌మెంట్‌లు చెల్లించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ప్రైవేట్, కార్పొరేట్ ఫీజుల దోపిడీని అడ్డుకుని, విద్యాహక్కు చట్టాలన్నీ అమలు చేయాలని అన్నారు. ఫీజుల దోపిడీపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా కార్యాచరణ రూపొందించిన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సభల్లో ఎస్ఎఫ్ఐ హనుమకొండ అధ్యక్షకార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, సూర్యం, బీరెడ్డి జస్వంత్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.పరిమళ, సాయికుమార్, మడికొండ మేఘన, సన్నీ, అజయ్, మల్లేశ్, పవన్‌కుమార్, ఎమ్డీ ఇస్మాయిల్, అరుణ్, కుమార్, వర్షప్రసాద్, నిరోషా, ప్రతిమ, కావ్య, సందీప్, అఖిల్, కన్నారావు, రాజ్‌కుమార్, రత్నం, స్వాతి, వేణు, పృథ్వీ, నరేశ్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వేస్టేషన్‌లో డ్రగ్ కంట్రోల్ టీం తనిఖీలు



డాగ్ స్క్వాడ్‌తో అనుమానితుల బ్యాగుల తనిఖీ చేస్తున్న దృశ్యం

వరంగల్ క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల నియంత్రణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో వరంగల్ రైల్వేస్టేషన్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల బ్యాగ్‌లతో పాటు రైల్వేస్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ శివకేశవులు, ఆర్ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నిక

ఖిలావరంగల్, మార్చి 29:(ఆంధ్రజ్యోతి)తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఏఐకేఎస్) కార్యవర్గ సభ్యులుగా నలుగురు ఎంపికయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి తెలిపారు. శనివారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నిజామాబాద్‌లో 25, 26, 27 తేదీలలో జరిగిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం 3వ రాష్ట్ర మహాసభలో 12 మంది నాయకులు పాల్గొన్నారన్నారు. అందులో నాలుగో రాష్ట్ర రైతు సంఘం కార్యవర్గ సభ్యులుగా వరంగల్ ప్రాంతానికి చెందిన వారు ఎంపికకావడం గర్వకారణమన్నారు. ఎంపికైన వారిలో బొడ్డుపల్లి సాయిలు, చుక్క మొగిలి, ఎంఏ పాషా, మడ్డి రాజారాంలు ఉన్నారని తెలిపారు. పార్టీలో మరింత ఎత్తుకు ఎదగాలని తెలిపారు.



అభినందిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి

జూన్ చివరి నాటికి 18 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యం

వరంగల్ జిల్లా ఇరిగేషన్ ఈఈ శంకర్ చౌహాన్

ముఖాముఖి



ఆంధ్రజ్యోతి: పూడిక తీత పనుల్లో నిబంధనల మేరకు ఎంత లోతు మట్టిని తీస్తున్నారు..?

ఈఈ: ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక మీటరున్నర లోతు పూడిక తీస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: భద్రకాళి చెరువు విస్తీర్ణం ఎంత..?

ఈఈ : ప్రభుత్వ లెక్కల ప్రకారం భద్రకాళి చెరువు 300 ఎకరాలు ఉంది.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ లెక్కల ప్రకారం చెరువు విస్తీర్ణం ఉందా...

ఈఈ : భద్రకాళి విస్తీర్ణం వివరాలు జీడబ్ల్యూఎంసీ పరిధిలో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: పూడిక తీత పనుల్లోని ఎంతమేరకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది..? ఇంకా కావాల్సిందెంత..?

ఈఈ: జూన్ 31 వరకు 18 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీత పనులు పూర్తి చేయాల్సి ఉండగా అందులో 6 లక్షల యాభైవేల క్యూబిక్ మీటర్ల పనులు నడుస్తున్నాయి. మిగతా 11 లక్షల యాభై వేల క్యూబిక్ మీటర్లకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. వర్క్ అగ్రిమెంట్ కావాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి: ఇప్పటివరకు ఎన్ని బ్లాకుల్లో పూడిక తీత పనులు కొనసాగుతున్నాయి..?

ఈఈ: ఇప్పటివరకు బ్లాక్ -1లో 30 ఎకరాలు, బ్లాక్ -2లో 30 ఎకరాలు, బ్లాక్ -3లో 48 ఎకరాల్లో 12 ఎక్సవేటర్లతో పూడిక తీత పనులు కొనసాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: వరద నివారణ చర్యల కోసం నాలాల మరమ్మతుల పనులు ఎక్కడెక్కడ చేపట్టారు..?

ఈఈ: వరద నివారణ చర్యల కోసం బొంది వాగుకు రూ.158 కోట్లతో మరమ్మతులు చేపడుతున్నారు.

\- మామునూరు (ఆంధ్రజ్యోతి)

ఉగాది వేడుకలకు ముస్తాబైన దేవాలయాలు



పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

ఖిలావరంగల్, మార్చి 29:(ఆంధ్రజ్యోతి)ఉగాది వేడుకలకు నగరంలోని దేవాలయాలు శనివారం సర్వాంగసిద్ధంగా ముస్తాబయ్యాయి. కమిటీ సభ్యులు గత నాలుగురోజులుగా సంబంధిత దేవాలయాలను శుద్ధి చేశారు. ఖిలావరంగల్‌లోని ఆంజనేయస్వామి, శ్రీ స్వయంభూదేవాలయం, తూర్పుకోట ఆంజనేయస్వామి దేవాలయం, పోచమ్మ దేవాలయం, పెద్దమ్మదేవాలయం, శివనగర్‌లోని సాయిబాబాదేవాలయం, శ్రీ సీతారామ చంద్రస్వామిదేవాలయం, లేబర్‌కాలనీ, శాలినీనగర్‌లోని పంచముఖ నాగేంద్రస్వామి దేవాలయం, విశ్వావసు నామసంవత్సరం సందర్భంగా దేవాలయ దర్వాజలకు మామిడిఆకులు, పూలను కట్టారు. దేవాలయ గోడలు,గోపురాలకు రంగులు వేశారు. అలాగే, దేవాలయ గేట్లు, గ్రిల్‌కుకలర్స్ వేశారు. దేవాలయ పరిసరాలలో చెట్లు, ముళ్లపొదలను శుభ్రంచేశారు. అనంతరం విద్యుత్‌దీపాలు, టెంట్లు, చలువ పందిళ్ళు, భారీకేడ్లు, తాగునీరు తదితర ఏర్పాటు చేశారు. దేవాలయాల్లో స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఆదివారం ఉదయం గం. 6-00లకు సుప్రభాత సేవ, మంగళస్నానం, అలంకరణ, పూజలు, 10 -00లకు గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, శ్రీరామ నవరాత్రి కలశస్థాపన, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 5-00లకు ఉగాది-పంచాంగ శ్రవణం ఏర్పాటు చేయనున్నారు.

తూర్పుకోటలో..

పెద్దమ్మతల్లి జాతర సందర్భంగా ఖిలావరంగల్ తూర్పుకోట పరిసర ప్రాంతాలలో పెరిగిన చెట్లు, ముళ్ళ పొదలను ప్రొక్లెయినర్‌తో శుభ్రం చేశారు. దేవాలయానికి వచ్చే తూర్పుకోట దారికి ఇరు పక్కల సీరియల్ బల్బ్‌లను ఏర్పాటు చేశారు. పెద్దమ్మ దేవాలయానికి స్థానిక 37, 38 డివిజన్ పడమర, మధ్య, తూర్పుకో టలతో పాటు ధర్మారం, వంచనగిరి, స్తంభంపల్లి, వెంకటాపురం, దూపకుంట, తదితర గ్రామీణ ప్రాంతాల నుంచి ఎండ్లబండ్లు, ట్రాక్టర్‌లు, డీసీఎం, మినీట్రాలీ, ఆటోలు, బైక్‌లతో దేవాలయం చుట్టూ ప్రదక్షిణగా తిరుగుతుంటాయి. పార్కింగ్ ఏర్పాట్లు, దేవాలయానికి వచ్చే ఎండ్ల బండ్లకు రావడానికి పోవడానికి వేర్వేరుగా ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ఉండేందుకు దారులను ఏర్పాటు చేశారు. అనంతరం దేవాలయం పెద్దమ్మతల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. ప్రత్యేక పూజలు చేస్తారు.

పెద్దమ్మ దేవాలయాన్ని సందర్శించిన ఏసీపీ

తూర్పుకోటలోని పెద్దమ్మదేవాలయాన్ని 37వ, డివిజన్ కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్, మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నంలతో కలిసి వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొయిని దూడయ్య, బెడిద వీరన్న, సంగరబోయిన చందర్, శ్రీనివాస్, రాజమల్లు, కుమార్, కరుణాకర్, కిరణ్, ప్రసాద్, ప్రతాప్, రఘు, ఐలయ్య, సాంబయ్య, కుమారస్వామి, శ్యామ్ పాల్గొన్నారు.



సీతారామచంద్రస్వామి ఆలయంలో చలువ పందిళ్లు

వృద్ధులకు అన్నదానం

వరంగల్ టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అన్నిదానాల్లో కెల్లా అన్నదానం ఎంతో గొప్పదని శ్రీమాత స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి నన్నపు సంజీవరావు అన్నారు. గ్రేటర్ వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడ జంక్షన్ వద్ద శ్రీమాత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమాత స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి సంజీవరావు మాట్లాడుతూ ఎండా కాలంలో పేద వృద్ధులకు అన్నం దొరకక ఇబ్బందులు పడుతున్నారని, వారి కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు ముద్దసాని మల్లిక, ఉపాధ్యక్షులు నల్లెల రాజేందర్, సభ్యులు కె.కళ, ఎం.శారద, జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీ

కరీమాబాద్, మార్చి 29,(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫోర్ట్‌రోడ్ ఈద్గాలో శనివారం పేద ముస్లింలకు రంజాన్ తోఫా పేరుతో కిట్లను పంపిణీ చేశారు. తవక్కుల్ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ ఎం.ఎ.జబ్బార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రంజన్ కిట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉర్సు దర్గా పీఠాధిపతి సయ్యద్ ఒబేద్ బాబా, వరంగల్ ఏసీపీనంది రామ్‌నాయక్, మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం, 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మస్వామిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథుల చేతుల మీదుగా పేద ముస్లింలకు కిరాణం సామానుతో ఉన్న కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ నందిరామ్ నాయక్ మాట్లాడుతూ రంజాన్ పర్వదినాన్ని అందరూ సంతోషంగా జరుపుకోవాలనే సదుద్దేశంతో పేద ముస్లింలకు రంజాన్ కిట్లను అందించిన తవక్కుల్ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ జబ్బార్‌ను అభినందించారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.చాంద్‌పాషా, ట్రస్టు సభ్యులు ఇంతియాజ్ ఖాన్, సయ్యద్ శబ్బీర్, సలీం, ఫహీం, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.



పేద ముస్లింలకు రంజాన్ కిట్లను అందజేస్తున్న ఒబేద్‌బాబా, ఏసీసీ నందిరామ్ నాయక్ తదితరులు

సీపీని కలిసిన మృతి చెందిన గొర్రెల బాధితులు

ఖిలావరంగల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఖిలావరంగల్ మట్టికోట సమీపంలో ఈ నెల 20న గుర్తు తెలియని వ్యక్తులచే దగ్ధమైన 450 గొర్రెల బాధితులు కుమారి -లక్ష్మణ్ కుటుంబసభ్యులు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను కలిశారు. హనుమకొ ండలోని సీపీని కలిసి శ నివారం వినతి పత్రాన్ని అందజేశారు. బాధితుల నుంచి పూర్తి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గొర్రెల బాధితులతో సీపీ మాట్లాడుతూ 450 గొర్రెలు దగ్ధమైన విషయమై సివిల్, స్పెషల్‌పార్టీ పోలీసులతో సమగ్రంగా విచారణ జరుపుతున్నామని తెలిపారు. గొర్రెల షెడ్డు దహనం కావడం ప్రమాదమా, కుట్రనా అంటూ ఎంక్వైరీ జరుపుతున్నామ న్నారు. త్వరలో గొర్రెలు దగ్ధమైన విషయమై పూర్తి సమాచారంతో దోషులను గుర్తించి పట్టుకుంటామన్నారు. ప్రభుత్వం ద్వారా బాధితులకు సహాయం అందేలా తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



సీపీకి వినతిపత్రం ఇస్తున్న గొర్రెల బాధితులు

వచ్చే నెల 4న వ్యాపారుల సంఘం ఎన్నికలు

వరంగల్ వ్యవసాయం, మార్చి 29:(ఆంధ్రజ్యోతి): వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ వ్యాపారుల సంఘం ఎన్నికలు ఏప్రిల్ 4న శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం కూరగాయల మార్కెట్ వ్యాపారుల సంఘ సభ్యులు ఓ ఫంక్షన్‌హాలులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అన్ని విషయాలను చర్చించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకోవాలని, ఎన్నికల నిర్వహణ కోసం నీల శ్రీనివాస్, కర్రు నాగేశ్వర్‌రావును నియమించుకున్నారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. 2వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు తమ పేర్లను కమిటీకి అందజేయాలని తెలిపారు. 4వ తేదీ శుక్రవారం ఉదయం 11 నుంచి 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహించబడుతాయి. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పోస్టులకు పోటీ చేయవచ్చని ఎన్నికల నిర్వహణ కమిటీ తెలిపింది.

రంగశాయిపేటలో ఘనంగా ఉగాది సంబురాలు



అరవింద పబ్లిక్ స్కూల్‌లో ఉగాది సంబురాలు



లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబురాలు

శంభునిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగు నూతన (విశ్వావసు నామ సంవత్సరం) ఉగాదిని పురస్కరించుకొని నగరంలోని రంగశాయిపేటలో గల విద్యాసంస్థల్లో శనివారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. రంగశాయిపేటలోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్‌లో ఉగాది వేడకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ శేర్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ పండుగలతోనే ముడిపడి ఉన్న మన సంస్కృతి సంప్రదాయాలను పిల్లలకు తెలిపేందుకే వేడుకలు నిర్వహించామన్నారు. ఈ వేడుకల్లో కరస్పాండెంట్ శేర్ల రజినీ, కృష్ణవేణి, సాలేహా, పూర్ణిమ, మానస సాయికృష్ణ, తస్లీమా, ప్రవీణ్ పాల్గొన్నారు.

అరవింద పబ్లిక్ స్కూల్‌లో..

రంగశాయిపేటలోని అరవింద పబ్లిక్ స్కూల్ ఉగాది వేడుకలతో పండుగ వాతావరణం సంతరించుకుంది. పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య ఉగాది పచ్చడిని విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రకృతితో మమేకమైన మన జీవన విధానాన్ని తెలిపేవే పండుగలు అని అన్నారు. అనంతరం ఉగాది పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సంప్ర దాయ దుస్తుల్లో అలరించగా సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో హెచ్ఎం పంచకం రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ సాంకేతిక సమస్యలు పరిష్కరించండి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్‌లో ఏర్పడే సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా కార్యాలయంలో జరుగుతున్న ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్ అధికారుల పనితీరును పరిశీలించారు. మేయర్ స్వయంగా సాంకేతిక సమస్యలను తెలుసుకుని అక్కడి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఈ నెల 30, 31 రెండు రోజుల పాటు ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్‌లు పని చేస్తాయని అన్నారు. ఫీజులో 25 శాతం రాయితీతో చెల్లించేందుకు మరో రెండు రోజులు మాత్రమే మిగిలి ఉందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆన్‌లైన్‌లో మార్కెట్ విలువలో తేడాలు, ఫీజు జనరేషన్ తదితర సమస్యలు ఉంటే హెల్ప్‌డెస్క్‌లకు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సీపీ రవీంద్ర రాడేకర్, ఏసీపీలు రజిత, శ్రీనివాస్‌రెడ్డి, ఇర్షాద్, టీపీఎస్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీని 90 శాతం రాయితీ ప్రకటించిందని, వన్‌టైం సెటిల్మెంట్ (ఓటీఎస్) అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. శనివారం బల్దియా కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 31లోపు ప్రాపర్టీ ట్యాక్స్‌లో అపరాధ రుసుము చెల్లించేందుకు గడువు దగ్గరగా ఉండడంతో ఆది, సోమవారాలు కార్యాలయాలకు సెలవు దినాలు ఉన్నప్పటికీ నగరంలోని ఈ సేవా కేంద్రాలు, ఆన్‌లైన్ సిటిజన్ పోర్టల్ ద్వారా ఆస్తిపన్నులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఆలస్యం చేసిన వారికి ఏప్రిల్‌నెల నుంచి వడ్డీతో పాటు అసలును చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. ఈ బంపర్ ఆఫర్‌ను ప్రజలు ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రజలు చెల్లించే పన్నులు బిల్‌కలెక్టర్లు, వార్డు ఆఫీసరు స్వీకరిస్తారని, పన్నులు చెల్లించదలచిన వారు సంబంధిత రెవెన్యూ, శానిటేషన్ అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

ఎంజీఎంను ప్రక్షాళన చేయండి

కలెక్టర్‌కు బీజేపీ నేతల వినతి

వరంగల్ కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పేదలకు అత్యంత ముఖ్యమైన ఎంజీఎం ఆస్పత్రిని యుద్ధ ప్రాతిపదికన ప్రక్షాళన చేయాలని, వెంటనే తగిన నిధులు కేటాయించాలి సమస్యలను పరిష్కరించాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంజీఎంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం జిల్లా కలెక్టర్ సత్యశారదకు బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం గంట రవికుమార్ మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేనితనంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి అధ్వాన్న స్థితికి చేరిందన్నారు. ఆస్పత్రిలో సరిపడా బెడ్లు, వీల్‌ఛైర్లు, స్ట్రెచర్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే బెడ్‌పై ఇద్దరు ముగ్గురిని పడుకో బెట్టాల్సిన దుస్థితి నెలకొందని పాలకుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనమన్నారు. ఎంజీఎంలో వైద్య పరికరాలు అందుబాటులో లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే మరమ్మతులు చేపట్టాలని రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు కుసుమ సతీష్, రత్నం సతీష్, బాకం హరిశంకర్, డాక్టర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, కనుకుంట్ల రంజిత్‌కుమార్, రఘునారెడ్డి, దీన్‌దయాళ్, కుమార్, బన్న ప్రభాకర్, భైరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కువినతిపత్రం అందజేస్తున్న గంట రవికుమార్, బీజేపీ నాయకులు

రైతుల ఆర్థికాభివృద్ధే దేశ అభివృద్ధి

శంభునిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం ప్రధాన వృత్తి అయిన భారతదేశంలో రైతులు ఆర్థికంగా వృద్ధి సాధిస్తేనే దేశం అభివృద్ధి చెందు తుందని ఖిలావరంగల్ పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్ అన్నారు. ఖిలావరంగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సర్వసభ్య సమావేశాన్ని శనివారం సొసైటీ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేడల జనార్దన్ మాట్లాడారు. సొసైటీ అభివృద్ధే ధ్యేయమని తెలిపారు. సమావేశంలో ఏవో రవీందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సోల్తి భూలక్ష్మీ, డైరెక్టర్‌లు బండి బాబురావు, బిల్లా హరేందర్, జూలూరి శ్రవణ్, తోటకూరి నర్సయ్య, గద్దె కొమురమ్మ, పసునూరి భిక్షపతి వేణురెడ్డి, ముప్ప సతీష్, పిన్నింటి రాజేశ్వర్‌రావు, ఆవునూరి కుమార స్వామి, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, ఈదురు విక్టర్, సొసైటీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేడల జనార్దన్

ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు



టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య

వరంగల్ చౌరస్తా, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లుగా తాను నమ్మిన సిద్ధాంతం కోసం ప్రతీ పేదవాడికి సంక్షేమ ఫలాలు అందజేసిన ఘనత ఎన్టీఆరేనని, పేదల కోసమే టీడీపీ పనిచేస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువేరు రవీందర్ అన్నారు. తెలుగుదేశం పార్టీ స్థాపించి 43 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆధ్వర్యంలో శనివారం నగరంలో పార్టీ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. పార్టీ కోసం పనిచేసిన సీనియర్ కార్యకర్తలు, నాయకులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిలువేరు రవీందర్‌తో పాటు ఠాకూర్ గణేష్‌సింగ్, సింగారపు దేవేందర్, రాజు, కొండ్రాతి శ్రీకాంత్, సిరబోయిన రాజు, కొండ్రాతి చిన్న రవి, తౌటం సంపత్, సింగారపు మురళి, అనుములరాజు, కందుకూరి రాజు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● మట్టెవాడ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు వరంగల్ తూర్పు నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. శనివారం 43వ టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ తూర్పు 28వ డివిజన్ విశ్వకర్మ వీధిలో నాగవెల్లి సురేష్ ఆధ్వర్యంలో పార్టీ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో వరంగల్ టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య విచ్చేసి టీడీపీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు జీవీఎల్.శ్రీధర్, బరిగెల సుధాకర్, డివిజన్ అధ్యక్షుడు కందుకూరు రవి, చాగంటి ప్రకాశ్, మామిళ్ల రాములు పాల్గొన్నారు.



నగరంలో ఆర్టీసీ బస్సులో మిఠాయిలు పంపిణీ చేస్తున్న టీడీపీ శ్రేణులు

విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలి

ఖిలావరంగల్, మార్చి 29:ఆంధ్రజ్యోతి)రాష్ట్రంలో ఇంకా విద్యాసంవత్సరం పూర్తికాకుండానే ప్రైవేట్, కార్పొ రేట్ స్కూల్స్ కళాశాలల్లో అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్ సంస్థలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల ని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదళ్ల శరత్ డిమాండ్ చేశారు. శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్ కళాశాలలు ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో పుట్టగొడు గుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలను నియంత్రణ చేయాలన్నారు. తల్లిదండ్రులు కార్పొరేట్ మోజులో పడి ప్రైవేట్ విద్యా సంస్థలకు కాసులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంస్థల్లో చేర్పించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్రను వీడి ముందస్తు అడ్మిషన్లను నిర్వహించే విద్యాసంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో విద్యా సంస్థల ఆధ్వర్యం లో పెద్ద ఎత్తున ఆందోళన చెస్తుమ న్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్ హరీష్, శరత్, శివ పాల్గొన్నారు.

సమాజంలో పెరుగుతున్న వృద్ధాశ్రమాలు

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ ● రంగశాయిపేటలోని వృద్ధాశ్రమాల్లో వైద్య శిబిరం

శంభునిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు విచ్ఛిన్నమవుతూ చిన్న కుటుంబాలు పెరుగుతున్నందునే సమాజంలో వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయని వరంగల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ అన్నారు. వరంగల్ జిల్లా న్యాయసేవా దికార సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెడిక వర్ హాస్పిటల్ సిబ్బందితో కలిసి నగరంలోని రంగశాయిపేటలో గల సాయి, ఎలగందుల అమృత స్మారక వృద్ధాశ్రమాల్లోని వృద్ధులకు శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం సాయికుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశిరావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థల్లో మార్పులు రావడం వల్ల చిన్న కుటుంబాలు ఏర్పడుతున్నాయని అన్నారు. డీఎస్ఎల్ఏ సెక్రెటరీ ఎం. సాయికుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశి వరావు మాట్లాడుతూ వైద్య పరీక్షలు నిర్వహించి పరీక్షలు చేయగా ఎక్కువమంది వృద్ధులు రక్తహీనత, మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారన్నారు. జిల్లా లీగల్ ఏయిడ్ కౌన్సిల్ మెంబర్ పి. శ్రీనివాసరావు, వైద్య అధికారులు డాక్టర్ రమ్య, సాయిప్రియ, మెడికవర్ డాక్టర్ పూర్ణచందర్‌రెడ్డి, వృద్ధాశ్రమ నిర్వాహకులు లావణ్య, లక్ష్మీనారాయణ, మామునూరు సీఐ రమేష్, ఎస్సైలు కృష్ణవేణి, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7 గ్రేటర్ వరంగల్
ఆదివారం 30 మార్చి 2025

సర్వర్ డౌన్..

- మీ సేవా కేంద్రాల్లో సర్వర్ సమస్య
- ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం
- తిరుగుతున్న యువవికాస దరఖాస్తుదారులు
- ఏప్రిల్ 5కు గడువు పూర్తి

9



విశ్వావసు ఉషస్సులో..

నేడు ఉగాది పర్వదినం

శ్రీ విశ్వావసు తెలుగు కొత్త సంవత్సరం ప్రారంభం

- ఆలయాల్లో జోరుగా సాగనున్న పంచాంగ శ్రవణాలు
- షడ్రుచుల సమ్మేళనమైన పచ్చడికి ప్రాధాన్యత
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భక్తుల దర్శనాలు
- శ్రీరామ నవరాత్రి వేడుకలూ ఆరంభం
- పూజా సామగ్రి కొనుగోళ్లతో సందడిగా కూడళ్లు

9

వసుధపై వసంతం వికసించిన తొలి రోజును స్మరించుకుంటూ.. తెలుగు నాట చేసుకునే తొలి పర్వం ఉగాది. ప్రకృతితో మమేకమైన మన సంస్కృతికి మచ్చుతునక ఈ పర్వం. చైత్రశుద్ధ పాడ్యమి ఆదివారం శ్రీ విశ్వావసు నూతన తెలుగు ఉగాది పర్వదినాన్ని జరుపుకునేందుకు వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రజలంతా సమాయత్తమయ్యారు. తెల్లవారుజామున్నే లేచి అభ్యంగన స్నానాలు ఆచరించి, మామిడితోరణాలు, పూలతో ఇంటిని అలంకరించుకుని, ఇంట్లో పూజా మందిరంలో ఇష్టదైవాన్ని పూజలు చేసి పూజించుకొని షడ్రుచుల ఉగాది పచ్చడి సేవించడం ఈ పండుగ పరమార్థం. పంచాంగ శ్రవణం శుభ గుణాలను ఇస్తుందని, శత్రువులను నశింపజేస్తుందని దుస్వప్న ఫలితాలను పోగొడుతుందని, ఆయుస్సును పెంచడమేకాక గంగా స్నాన, గోదాన ఫలితాలను ఇస్తుందన్న విశ్వాసంతో ప్రతీ ఒక్కరు పంచాంగ శ్రవణాన్ని వినేందుకు ఆసక్తి చూపుతారు. ప్రధానంగా శుభ, అశుభ ఫలితాలు, గ్రహచార ఫలం, ఫలశృతి, సంవత్సరాంత ఫలితం, ఏ గ్రహానికి అధికారం లాంటి విషయాలు తెలుసుకొని మనిషి భవిష్యత్ మార్గదర్శనం చేసుకునేందుకు ఈ పర్వదినం గీటురాయిగా తీసుకుంటారు.

-హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్



పూజ సామాను కొనుగోలు చేస్తున్న ప్రజలు

డివిజన్ హోదా దక్కకుండా కుట్రలు

- కాజీపేటకు రైల్వే డివిజన్ సాధించి తీరుతాం..
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాజీపేట జంక్షన్‌కు డివిజన్ హోదా రాకుండా కొందరు అధికారులు కుట్రల పన్నుతున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆరోపించారు. ఆ కుట్రలో భాగమే ఇక్కడికి రావాల్సిన లోకోరన్నింగ్ స్టాఫ్ పోస్టులను ఇతర డివిజన్‌లకు తరలిస్తున్నారని, వారి కుట్రలు తిప్పి కొట్టి డివిజన్ సాధించి తీరుతామని అన్నారు. కాజీపేట రైల్వే సంఘ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడారు. కాజీపేటకు మంజూరు కావాల్సిన క్రూకంట్రోల్ నుంచి 185 మంది లోకోపైలెట్‌లు, అసిస్టెంట్ లోకో పైలెట్‌లు, ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఇతర డివిజన్‌లకు తరలించారని రైల్వే ఆర్డర్ విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తరలించిన పోస్టులను వెంటనే కాజీపేటకు తీసుకురావాలని హెచ్చరించారు. డివిజన్ రాకుండా ఓ రైల్వే అధికారి చేసే కుట్రలే ఇవి అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

25 ఏళ్లగా కాజీపేట అభివృద్ధికి ఉద్యమాలు చేస్తున్నామని నాయిని పేర్కొన్నారు. కోచ్‌ఫ్యాక్టరీ, డివిజన్ సాధన, పిట్‌లైన్‌లకోసం నిత్యం రైల్వే జీఎం, డీఆర్‌ఎంల దృష్టికి తీసుకెళ్లామన్నారు. డివిజన్ సాధన కోసం ఎంపీ కడియం కావ్య నేతృత్వంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలుస్తామన్నారు. ఇందుకు జిల్లా బీజేపీ నాయకులు కలిసిరావాలని, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి ద్వారా డివిజన్ సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. లేకుంటే అన్నిరాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, ట్రేడ్ యూనియన్ నాయకులతో కలిసి జేఏసీగా ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈమీడియా సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి. అంకూస్, నాయకులు బంక సంపత్, షేక్ అజ్గర్, ఇప్ప శ్రీకాంత్, తమ్మడి మానస, బబ్లూ, దువ్వ రాజు, రేవతి, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద

దివ్యాంగుల వినతులు వెంటనే పరిష్కరించాలి

వరంగల్ కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల నుంచి అందిన వినతులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సత్యశారద కోరారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన దివ్యాంగుల ప్రజావాణిలో వినతులు స్వీకరించి మాట్లాడారు. దివ్యాంగుల కోసం నిర్వహించే ప్రత్యేక ప్రజావాణిలో అందిన వినతులు శాఖల వారిగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. దివ్యాంగులు, వయోవృద్ధుల నుంచి మొత్తం 9 వినతులు రాగా, ఇందులో డీఆర్‌డీవో సంబంధించి 4, జిల్లా సంక్షేమ శాఖ 2, జడ్పీ సీఈవో 3 వచ్చాయి. ప్రత్యేక ప్రజావాణిలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మీ, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేయూ బడ్జెట్ రూ.428.82 కోట్లు

- ప్రభుత్వ గ్రాంట్లు రూ.195.62కోట్లు
- ఇతర వనరుల నుంచి రూ.170.55కోట్లు
- ఉద్యోగుల జీతభత్యాలకు రూ.369.21కోట్లు
- వర్సిటీ లోటు బడ్జెట్ రూ.2.45 కోట్లు
- వర్సిటీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్

9

సీఎం రేవంత్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం



కొండూరులో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రాయపర్తి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోనే రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డిలు అన్నారు. శనివారం మండలంలోని కేశవపురంలో హెల్త్ సెంటర్, గన్నారం నుంచి రాయపర్తికి బీటీ రోడ్డు పనులు, కొండూరు గ్రామంలో బ్రిడ్జి రోడ్ నిర్మాణ పనులు, పెర్కవేడులో సబ్ స్టేషన్, హెల్త్ సెంటర్, ఏకే తండాలో రోడ్డు శంకుస్థాపన, మహబూబ్‌నగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరం పనిచేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అపోహలకు గురి కాకుండా ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ తదితరులు ఉన్నారు.

పేదల పెన్నిధి ఎన్‌టీఆర్



టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న మరియ సురేఖ

వర్ధన్నపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పేదల పెన్నిధిగా నిలిచి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ పనిచేసిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ మరియసురేఖ అన్నారు. శనివారం వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలోని స్వామి వివేకనంద విగ్రహం వద్ద టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని టీడీపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య సెల్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎలగుందుల రవీందర్‌గుప్తా, నాయకులు కటకం కుమార్, మునుకుంట్ల దేవేందర్ పాల్గొన్నారు.

● వర్ధన్నపేట రూరల్ (ఆంధ్రజ్యోతి) : ఎన్‌టీఆర్ తెలుగు దేశం పార్టీ ని స్థాపించి తొమ్మిది నెలల్లో అధికారంలోకి వచ్చి పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ప్రవేశపెట్టిన పథకాలను ఎవరు మరువలేరని టీటీ డీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ మరియ సురేఖ అన్నారు. శనివారం మండలంలోని ఇల్లందలో ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ ఆవిర్భావ దినో త్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నంద మూరి తారకరామారవు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అరూరి కుమారస్వామి, చాడ కరుణాకర్, బంక సందీప్, సృజిత్, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

● ఖానాపురం (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మహబూబాబాద్ పార్లమెంటరీ అడహక్ కమిటీ సభ్యుడు సూర్య ప్రకాశ్ రావు, నర్సంపేట డివిజన్ ఇన్‌చార్జ్ నర్సింగరావు, మండల ఇన్‌చార్జ్ సురేష్, పార్టీశ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

● సంగెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీగరాజుపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం టీడీపీ నాయకులు నిర్వహించారు. పార్టీ పార్లమెంటు కన్వీనర్ అర్షనపల్లి విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ లక్ష్మణ్,కలమాల మహేందర్,జవ్వాజీ నరేందర్,గాజుల నరేందర్, రాము, వినయ్, వెంకటేశ్, రాజేందర్, రాములు, కుమార్ పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ కరపత్రాల ఆవిష్కరణ

నర్సంపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఏప్రిల్ 2న నిర్వహించనున్న బీసీల పోరు గర్జనను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను సంఘం నాయకులు శనివారం పట్టణంలో ఆవిష్కరించారు. సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం ప్రభుత్వం ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీజుల సాగర్, రమేష్, శ్యామ్, పృధ్వీరాజ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి స్నేహితుల ఆర్థికసాయం

నర్సంపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): భర్తను కోల్పోయి దుఃఖంలో ఉన్న స్నేహితురాలికి మేమున్నామంటూ చిన్ననాటి స్నేహితులు ముందుకు వచ్చారు. నర్సంపేట పట్టణానికి చెందిన మర్రి స్వాతి భర్త రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్వాతి చిన్ననాటి స్నేహితులు రూ.50వేల ఆర్థికసాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. గుండం రంజిత్, గాదెగోని మనోజ్‌కుమార్, నాగరాజు, తొగరు రాజు తదితరులు ఉన్నారు.

గొల్లబామతండాలో వివాహిత అదృశ్యం

చెన్నారావుపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లబామతండాకు చెందిన గుగులోతు స్వరూప అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై రాజేష్‌రెడ్డి శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇదే తండాకు చెందని స్వరూప తన భర్త రమేష్‌తో గొడవ పడి ఇంట్లో నుంచి శుక్రవారం వెళ్లింది. అప్పటి నుంచి చుట్టు పక్కల, బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. స్వరూప తండ్రి బానోతు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలు

ఖానాపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మంగళవారిపేట ప్రాథమిక పాఠశాల, బుధరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఉగాది పచ్చడి తయారు చేసి విద్యార్థులకు వితరణ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విజయలక్ష్మీ, ఆరిఫ్‌హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా స్కూల్‌డే వేడుకలు

నర్సంపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇటుకాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థిని, విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. తెలంగాణ జాగృతి కళాకారులు నెల్లుట్ల సుమన్ బృందం కల్చరల్, ఫోక్, సినిమా పాటలతో వేడుకల సంబరాలు అంబరాన్నంటాయి. అనంతరం ఎంఈవో కొర్ర సారయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు, వసతులతో ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రమాదేవి, ఆదర్శ పాఠశాల ఛైర్మన్ మహేశ్వరి, స్థల దాత కొనకటి గణేష్, ఉపాధ్యాయులు మంగ్య, శ్రీనివాస్, డి. రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగోసారి సంత వేలం పాటలు దుబార

నెక్కొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతిలో నిర్వహించే వారంతపు సంతలో రహదారి వసూళ్లకు గాను శనివారం జరిగిన వేలం పాటలో అప్‌సేట్ ప్రైస్ (నిర్ణిత ప్రభుత్వ ధర) రాకపోవడంతో అధికారులు వేలం పాటలకు వాయిదా వేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను సంతలో గొర్రెలు, మేకల, పశువుల, లైబజారు (గంపచీటి) వసూళ్ల సంబంధించి వేలం పాటలు నిర్వహించారు. పాటల్లో పాల్గొన కాంట్రాక్టర్‌లు ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే తక్కువ పాట రావడంతో నాలుగోసారి పాటలను దుబార చేశారు. ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారికి లిఖిత పూర్వకంగా తెలుపుతామని నర్సంపేట డీఎల్‌పీవో రాజీవ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి దయాకర్, కార్యదర్శి డి.సదానందం, పంచాయతీ సిబ్బంది శ్రీలత, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు

నేడు గవిచర్ల గుండబ్రహ్మయ్య జాతర

• భారీగా తరలిరానున్న భక్తులు



గుండబ్రహ్మయ్య ఆలయం

సంగెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల రాజుల కాలంలో జిల్లా కేంద్రానికి సమీపంలోని సంగెం మండలంలోని గవిచర్ల గ్రామంలో నిర్మించిన గుండ బ్రహ్మయ్య ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ప్రతి ఏడాది నిర్వహించే జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ కొంతం యాదగిరిలు తెలిపారు. ఉగాది రోజున గ్రామంలోని ఆలయ ప్రధాన పూజారి పిల్లలమర్రి కార్తికాచార్యుల ఇంటినుంచి విగ్రహాలను వాయిద్యాల మధ్య ఊరేగింపుగా గ్రామస్థులు తీసుకొని వచ్చి ఆలయంలో ప్రతిష్ఠించడంతో జాతర ప్రారంభమవుతుంది. రాత్రంతా జరిగే జాతరకు సంగెం మండలంలోని రాంచంద్రాపురం, లోహిత, షాపూరం, తీగరాజుల పల్లి, ఆశాలపల్లి, కాట్రపల్లి, వరంగల్, రంగశాయిపేట, గాడిపెల్లి, బొల్లికుంట గ్రామాలతో పాటు పలు మండలాలకు చెందిన భక్తులు తరలి వచ్చి తమ మొక్కులను తీర్చుకుంటారు. ఉగాది రోజు సాయంత్రం నుంచి ప్రారంభమయ్యే జాతర రాత్రంతా సాగుతుందని తెలిపారు. భక్తులు ఎడ్ల బండి, ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్రవాహనాల ద్వారా ఆలయానికి చేరుకుని ఆలయంలోని విగ్రహాలను దర్శించుకుంటారు. కాగా, ప్రభుత్వం అందించిన నిధులతో పాటు భక్తుల నుంచి సేకరించిన విరాళాలతో చేపట్టిన ఆలయ నిర్మాణం పూర్తి కావస్తున్నందున ఆలయంలో సభ్యులకు కొంత మేర అసౌకర్యం కలుగుతున్నదని, భక్తులు సహకారం అందించాలని కమిటీ కోరింది.

అలజడులు జరుగకుండా బాధ్యతలు తీసుకోవాలి : ఏసీపీ

గుండ బ్రహ్మయ్య జాతరలో ఎలాంటి అలజడులు జరుగకుండా కమిటీ ప్రతినిధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మామునూరు ఏసీపీ తిరుపతి చెప్పారు. శనివారం సాయంత్రం గ్రామంలోని ఆలయాన్ని సందర్శించి ఉగాది రోజున జరిగే జాతర వివరాలను కమిటీని అడిగి తెలుసుకున్నారు. ఆలయం చుట్టపక్కల మద్యం తాగి అలజడులు సృష్టించే వారిపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆలయం చుట్టు విద్యుత్ దీపాలను అమార్చాలని చెప్పారు. ప్రభ బండ్లు తిరిగే సమయంలో ప్రమాదాలు జరుగకుండా చూడాలని చెప్పారు. ఈకార్యక్రమంలో పర్వతగిరి సీఐ రాజగోపాల్, సంగెం ఎస్సై నరేష్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతరలో డీజేలు నిషేధం : సీఐ

మండలంలోని గవిచర్ల గ్రామంలో గల గుండబ్రహ్మయ్య జాతరను విజయవంతం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకారం అందించాలని పర్వతగిరి సీఐ రాజగోపాల్ చెప్పారు. శనివారం మండలంలోని గవిచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి రాజకీయ ప్రభ బండ్లు, డీజేలను జాతరలో నిషేధించినట్లు చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ వివరించారు. జాతర సందర్భంగా గ్రామంలోని అన్ని రాజకీయ పార్టీలు పోలీస్ శాఖకు సహకారం అందించాలని చెప్పారు. తహసీల్దార్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఉగాది రోజున నిర్వహించే జాతరను సంప్రదాయం ప్రకారం జరిపించుకోవాలని సూచించారు. ఎస్సై నరేష్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతీ ఒక్కరు పోలీస్ శాఖ అందించిన సూచనలను పాటిస్తూ జాతరలో పాల్గొనాలని చెప్పారు. జాతరలో అల్లర్లు సృష్టించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు గూడ సంపత్‌రెడ్డి, దొనికెల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బాసిపాక యాకూబ్, ఆలయ కమిటీ ఛైర్మన్ కొంతం యాదగిరి, సొసైటీ ఛైర్మన్ ముడిదే శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి



నర్సంపేట వేంకటేశ్వరాలయంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

నర్సంపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి త్వరలో చేపట్టే మంత్రివర్గ విస్తరణలో చోటు కల్పించాలని కోరుతూ పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ ఎర్ర జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు శనివారం ఆలయ అర్చకుడు రామానుజాచార్యుల వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గత 50 ఏళ్ళ రాజకీయ ప్రస్థానంలో సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన దొంతి మాధవరెడ్డి ఈ ప్రాంత ప్రజల మన్నలను అందుకున్నారన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు దుబ్బ రమేశ్, కార్యదర్శి వేంశెట్టి శ్రీనివాస్, గౌరవ సలహాదారులు బాల్నె సర్వేశం, సభ్యులు చింతల నిరంజన్, బండారి దామోదర్, రామగోని సుధాకర్, వీరమనేని వెంకటేశ్వరరావు, శింగిరికొండ రవీందర్, రేమిడికట్టయ్య పాల్గొన్నారు. నేడు (ఆదివారం) సాయంత్రం 5 గంటలకు వేంకటేశ్వరాలయంలో ఉగాది పర్వదినం విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణాన్ని ఆలయ అర్చకుడు రామానుజాచార్యులతో నిర్వహిస్తామని ఆలయ కమిటీ ఛైర్మన్ ఎర్రజగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో రావాలని ఆయన కోరారు.

● నర్సంపేట టౌన్ (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీనీ నమ్ముకొని నలభై ఏళ్లగా పనిచేస్తున్న సీనియర్ నాయకుడు, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి అధిష్ఠానం రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సొసైటీ ఛైర్మన్ నుంచి ఏపీసీసీ సభ్యులుగా ఎన్నో పదవులను చేపట్టి పార్టీ పటిష్ఠత, ప్రజల కోసం పనిచేస్తున్న మాధవరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆడెపు రమాదేవి, సాంబలక్ష్మి, జ్యోతి, కల్పన, పద్మాబాయి పాల్గొన్నారు.

● దుగ్గొండి (ఆంధ్రజ్యోతి): నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మంత్రి పదవి రావాలని ఆశిస్తూ మండల యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం గీసుగొండ మండలంలోని లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం మెట్లపై మోకాళ్లతో నడుచుకుంటూ వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ మండల బాధ్యులు, గ్రామాలకు చెందిన యూత్ బాధ్యులు పెద్ద సంఖ్యలో దేవాలయానికి వెళ్లి మంత్రి పదవీ రావాలని పూజలు చేశారు. ఈకార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తకొండ రవివర్మ, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ డ్యాగం శివాజీ, సునీల్, నరేశ్, అనిల్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

గీసుగొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మత సామరస్యానికి, సౌభాతృత్వానికి ఇఫ్తార్ విందులు ప్రతీకలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం 15, 16,17వ డివిజన్‌ల ముస్లింల కోసం జాన్‌పాకలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు వేడుకల్లో ఎమ్మెల్యే రేవూరి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఆచరించే కఠోర ఉపవాస దీక్షలు, దైవప్రార్థనలు జీవిత పరమార్థాన్ని తెలియచేస్తాయన్నారు. మనుషులంతా సోదర భావంతో ఉండాలన్నదే అన్ని మతాల సారాంశం అన్నారు. ఉపవాసాలు ఉంటున్న ముస్లింలకు ఎమ్మెల్యే అల్పాహారం అందించారు. కాగా, ఎమ్మెల్యే రేవూరి, ఇనగాల వెంకట్రాంరెడ్డిలను ముస్లింలు ఘనంగా పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, నాయకులు కొండేటి కొమురారెడ్డి, చాడా కొమురారెడ్డి, దూపాకి సంతోష్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

● నెక్కొండ (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయాలకు కట్టిబడి ఉంటూ సర్వమతాలను గౌరవిస్తూ ప్రపంచదేశాలకు ప్రతీకగా భారతదేశం ఉండడం ఎంతో గౌరవకారణమని నర్సంపేట టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, మార్కెట్‌ఛైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం నెక్కొండ మజిద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్సై మహేందర్, రామాలయ కమిటీ ఛైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, హరిప్రసాద్, మైనార్టీ నాయకులు షేక్ షబ్బీర్, ఎమ్డీ.అన్వర్, ఎమ్డీ.ఇబ్రహీంఖాన్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యావంతులైతేనే అభివృద్ధి

నెక్కొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : వయసుతో పని లేకుండా ప్రతీ ఒక్కరు విద్యావంతులు కావడాన్ని బాధ్యతగా తీసుకోవాలని నెక్కొండ డిప్యూటీ తహసీల్దార్ రవి అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో శనివారం జరిగిన పౌర హక్కుల దినోత్సవం సభల్లో ఆయన మాట్లాడారు. విద్యావంతులైతే రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధిస్తారన్నారు. అర్హులైన పేదల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కాలనీల్లో ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనంచేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి, పంచాయతీ కార్యదర్శి శిరీష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజ్మా, అంగన్‌వాడీ టీచరులు బాలీ, ఉమాదేవి పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో చట్ట వ్యతిరేకంగా పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తాం

నర్సంపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో చట్ట వ్యతిరేకంగా ఎవరైన పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని నల్లబెల్లి ఎస్సై గోవర్ధన్ తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ.. కామన్‌మ్యాన్ ఆర్86322 ట్విట్టర్ (ఎక్స్) అకౌంట్ ద్వారా ఉద్దేశపూర్వకంగా నల్లబెల్లి పోలీసులు అందరూ దొంగలు అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి అసత్య ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏలాంటి ఆధారాలు లేకుండా నల్లబెల్లి పోలీసులను అవమాన పరచడంతో ఆ వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు వెల్లడించారు. దర్యాప్తు అనంతరం అరెస్ట్ చేస్తామన్నారు. ఎవరైనా సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా ప్రజలను, చట్టాన్ని, రాజకీయ పార్టీలను, రాజకీయ నాయకులను, ప్రభుత్వ అధికారులను ఏలాంటి ఆధారాలు లేకుండా అవమాన పరిచేలా పోస్టులు పెట్టి అసత్య ప్రచారంచేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

తెలంగాణను అధోగతిపాలు చేసిన ఘనత బీఆర్ఎస్‌దే



మాట్లాడుతున్న తూళ్ల రవి

వర్ధన్నపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల పాలనలో అధోగతిపాలు చేసి భ్రష్టుపట్టించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తూళ్ల రవి, వర్ధన్నపేట మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిమిరెడ్డి కృష్ణారెడ్డిలు అన్నారు. శనివారం వర్ధన్నపేట పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు దశల వారీగా అమలు చేస్తూ ముందుకు సాగుతుంటే, తమకు భవిష్యత్‌లో పుట్టగతులు ఉండవని భావించి అసత్య ఆరోపణలు చేయడం వారికే చెల్లిందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఎన్నికైన నాటినుంచి ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ సమస్యలతో పాటు రాష్ట్రంలోని పలు సమస్యలపై శసన సభలో గళం విప్పి పరిష్కరానికి కృషి చేస్తున్నారన్నారు.

జూన్ 31 నాటికి 18 లక్షల క్యూబిక్ మీటర్లే లక్ష్యం

వరంగల్ జిల్లా ఇరిగేషన్ ఈఈ శంకర్ చౌహాన్

ఫటా ఫట్



ఆంధ్రజ్యోతి: పూడిక తీత పనుల్లో నిబంధనల మేరకు ఎంత లోతు మట్టిని తీస్తున్నారు..?

ఈఈ: ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక మీటరున్నర లోతు పూడిక తీస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: భద్రకాళి చెరువు విస్తీర్ణం ఎంత..?

ఈఈ : ప్రభుత్వ లెక్కల ప్రకారం భద్రకాళి చెరువు 300 ఎకరాలు ఉంది.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ లెక్కల ప్రకారం చెరువు విస్తీర్ణం ఉందా...

ఈఈ : భద్రకాళి విస్తీర్ణం వివరాలు జీడబ్ల్యూఎంసీ పరిధిలో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: పూడిక తీత పనుల్లోని ఎంతమేరకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది..? ఇంకా కావాల్సిందెంత..?

ఈఈ: జూన్ 31 వరకు 18 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీత పనులు పూర్తి చేయాల్సి ఉండగా అందులో 6 లక్షల యాభైవేల క్యూబిక్ మీటర్ల పనులు నడుస్తున్నాయి. మిగతా 11 లక్షల యాభై వేల క్యూబిక్ మీటర్లకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. వర్క్ అగ్రిమెంట్ కావాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి: ఇప్పటివరకు ఎన్ని బ్లాకుల్లో పూడిక తీత పనులు కొనసాగుతున్నాయి..?

ఈఈ: ఇప్పటివరకు బ్లాక్ -1లో 30 ఎకరాలు, బ్లాక్ -2లో 30 ఎకరాలు, బ్లాక్ -3లో 48 ఎకరాల్లో 12 ఎక్సవేటర్లతో పూడిక తీత పనులు కొనసాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: వరద నివారణ చర్యల కోసం నాలాల మరమ్మతుల పనులు ఎక్కడెక్కడ చేపట్టారు..?

ఈఈ: వరద నివారణ చర్యల కోసం బొంది వాగుకు రూ.158 కోట్లతో మరమ్మతులు చేపడుతున్నారు.

- మామునూరు (ఆంధ్రజ్యోతి)

ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు

నర్సంపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలైన సంఘటన నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డులో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నర్సంపేట మండలం లక్నేపల్లి శివారులోని బిట్స్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న నర్సంపేటకు చెందిన ఛత్రపతిశివాజీ అతని స్నేహితుడు శ్రీకర్‌లు బైక్‌పై నర్సంపేట నుంచి కళాశాలకు వెళ్తుండగా వరంగల్ నుంచి నర్సంపేటకు వస్తున్న గూడ్స్ వ్యాన్ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో శ్రీకర్, ఛత్ర పతి శివాజీలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వీరిని వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

రైతుల శాపం ప్రభుత్వానికి తగలక తప్పదు



పెర్కవేడులో ఎస్సారెస్పీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్ రావు

రాయపర్తి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఎడ్డేడ్చిన వ్యవసాయం. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్లు చరిత్రలో లేదని, ప్రస్తుతం తెలంగాణలో రైతుల శాపం ప్రభుత్వానికి తగలక తప్పదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. శనివారం మండలంలోని పెర్కవేడు గ్రామం మీదుగా వస్తున్న మాజీ మంత్రిని చూసి పలువురు రైతులు తన కాన్వాయిని ఆపి, ఎస్సారెస్పీ నీరు రావడంలేదని తమ గోడ వెల్లబోసుకున్నారు. దీంతో స్పందించి ఎర్రబెల్లి వెంటనే ఎస్సారెస్పీ అధికారులకు ఫోన్ చేసి నీరు విడుదలచేయాలని కోరారు. అనంతరం ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే కరువని, మన రాష్ట్రానికి పీడలా కాంగ్రెస్ పార్టీ దాపరించిందని ఆరోపించారు. సాగు నీరులేక పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం రైతుల పై సవితి తల్లి ప్రేమ చూపుతోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రాక్షస పాలన పోయి మంచి పాలన రావాలని నూతన సంవత్సరం సందర్భంగా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ వల్లే రైతులకు ఎంతో మేలు జరిగిందని గుర్తు చేశారు.

పోరాటాలతోనే హక్కులను సాధించుకోవాలి

నర్సంపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే గుడిసె వాసులు హక్కులను సాధించుకోవాలని ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు జనగాం కుమారస్వామి అన్నారు. పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎంఎస్పీ, డీపీడీపీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌నగర్ కాలనీ వాసులు చేపట్టిన రిలేదీక్షలు శనివారం నాటికి ఐదో రోజుకు చేరాయి. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ నగర్‌లో కనీస, మౌలిక సౌకర్యాలు కల్పించాలని అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్‌కుమార్, ప్రజా దంగోరా జాతీయ అధ్యక్షుడు అందె రవి, వేల్పుగొండ రాజు, కుమ్మరికుంట్ల శ్రీకాంత్, దామెర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ చెక్కు పంపిణీ

దుగ్గొండి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివాజీనగర్‌కు చెందిన బుస్సారి సిందూజకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కును ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా, మంజూరైన సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ రూ.19 వేల చెక్కును బుస్సారి సిందూజకు శనివారం మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుకినె నాగరాజు పంపిణీచేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బుస్సారి రామారావు, రాజేశ్వర్‌రావు, మనోహర్, తిరుమలరావు, గుండెకారి రామారావు, చందర్‌రావు, రాజు, కాలే శ్రీనివాస్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

గీసుగొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వీరగోని కుమారస్వామి అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. కాగా, మృతుని బాల్య స్నేహితుడైన స్థానిక రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ రూ.25వేల ఆర్థికసాయాన్ని అందించారు. ఆయన వెంట సోషల్ సర్వీస్ టీం సభ్యులు కర్ణకంటి రామ్మూర్తి, ములక సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఎమ్డీ.సోని, నర్సెట్టి శ్రీనివాస్, వీరగోని నాగేష్, పొగాకు భిక్షపతి, పరుషరాములు, నరేందర్ ఉన్నారు.